ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
శుక్రవారం 28, జూన్ 2024

కష్టపడకుండానే ఈజీ మనీ కోసం అలవాటు పడిన వారిని లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు 'మైక్వీన్' పేరిట భారీ మోసానికి తెరదీశారు. మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ను మైక్వీన్ పేరిట కొన్నినెలల క్రితం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. నేరగాళ్లు ఊహించినట్లుగానే పలువురు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, చిరువ్యాపారులు, సాధారణ ప్రజలు, యువత వీరి మాయలో పడ్డారు. ఈ స్కీంలో భారీగా పెట్టుబడి పెట్టి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. ఒక్క మార్కాపురం డివిజన్‌లో పలు మండలాల నుంచి దీని ద్వారా రూ.10 కోట్లను అక్రమార్కులు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. పేద, మధ్య తరగతి వారు కూడా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. దీంతో నిర్వాహకులు వారు అనుకున్న లక్ష్యం పూర్తికాగానే మైక్వీన్ యాప్‌ను ఎత్తివేశారు.



మైక్వీన్ మాయ..!

మార్కాపురం/కంభం, జూన్ 27: ఎన్నిసార్లు మోసపోయినా అత్యాశపరుల తీరులో మార్పు రావడం లేదు. సులువుగా డబ్బు సంపాదించాలనే వారి బలహీనతలను కొందరు రెట్టింపుల ఆశచూపి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో మనుషుల ద్వారా ఆర్థిక మోసాలు జరిగితే నేడు అందుకు ఆన్‌లైన్ వేదికైంది. రూపాయి పెట్టుబడి పెడితే 5 నుంచి 10 రెట్ల వరకు నెలనెలా కొంతమొత్తం ద్వారా చెల్లింపులు జరుగుతాయని ఆశ పెడుతున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు సులువుగా ఆకర్షితులై అప్పులు చేసి మరీ పెట్టుబడి పెట్టి నట్టేటా మునుగుతున్నారు. ఏడు రెట్లు మేర డబ్బులు వస్తాయని ఈ మధ్యకాలంలో మార్కాపురం డివిజన్‌లో మై క్వీన్ అనే యాప్‌లో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. మార్కాపురం పట్టణంతోపాటు, గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట, యర్రగొండపాలెం, దోర్నాల, త్రిపురాంతకం తదితర మండలాల్లో మై క్వీన్ యాప్‌లో ఇరుక్కున్న వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. చైనా హ్యాకర్లు తయారు చేసిన ఆ యాప్‌కు విపరీతమైన ఫాలోయింగ్ ఉండటంతో వేలాది మంది సభ్యులుగా చేరినట్లు తెలుస్తోంది. చాలామందికి యాప్ పేర్కొన్న మేరకు డబ్బులు తిరిగి రాకపోతుండటంతో మోసపోయామని గుర్తించి ఘొల్లుమంటున్నారు. మార్కాపురం డివిజన్‌లోనే సుమారు 15 వేల మందికి రూ.10 కోట్లకుపైనే శఠగోపం పెట్టినట్లు సమాచారం.



ఆన్‌లైన్ లింకుతో ఘరానా మోసం

ఆశల వలతో భారీగా వసూలు

అంతా చైన్‌లింక్ ద్వారానే తతంగం

నిండా మునిగిన

ఉద్యోగులు, చిరువ్యాపారులు, యువత

మధ్యవర్తుల ద్వారా లింకుతో...

మై క్వీన్ యాప్ నేరుగా ఇన్‌స్టాల్ చేసుకుంటున్న వాళ్లు తక్కువమందే. కానీ ఇప్పటికే అందులో సభ్యత్వం పొందిన వాళ్ల లింకు ద్వారా సభ్యులను చేర్పితే వారికి కమీషన్ ఇస్తున్నారు. ఈ లింకు ప్రక్రియ ద్వారానే మార్కాపురంతో పాటు జిల్లావ్యాప్తంగా వేలాదిమంది మై క్వీన్ యాప్‌లో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది. రూ.100 నుంచి మొదలుకొని రూ.లక్షల్లో అందులో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం ఉంది. ఎక్కువశాతం మంది రూ.వేలల్లో పెడుతున్నట్లు సమాచారం. లింకు ద్వారా యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత రూ.100తో సభ్యత్వం తీసుకోవచ్చు. అందులో బ్యాంకు అకౌంట్ వివరాలు పొందుపర్చాలి. తర్వాత రోజుకు కొంత చొప్పున నెల రోజుల్లో రూ.100 సభ్యత్వం తీసుకున్న వారికి రూ.700 అకౌంట్‌లో జమచేస్తారు. యాప్‌లో కొంతమేర రకరకాలైన సామగ్రిని కూడా ఉంచి అవి కొనుగోలు చేయాలని కూడా షరతులు ఉంటాయి. అంతేకాక తక్కువ మొత్తమైతే తక్కువ రోజుల్లో.. ఎక్కువ మొత్తంలో అయితే ఎక్కువ రోజుల్లో రోజుకు ఇంత చొప్పున టైమ్‌స్లాట్‌లో డబ్బులను సభ్యులకు జమచేస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దికొద్దిగా డబ్బులు చెల్లిస్తుండడం, యాప్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వచ్చి పడడం చూసి మరింత మంది ఆకర్షితులయ్యారు. మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ ద్వారా పట్టణంలో ఎక్కువమంది యాప్‌కు ఆకర్షితులైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనది మహోన్నతమైన వృత్తి కావడంతో ఆయన్ను నమ్మి అందులో ప్రైవేటు ఉపాధ్యాయులు, చిరు ఉద్యోగులు సైతం పెట్టుబడి పెడుతున్నారు. లింకు పంపడం ద్వారానే నెలకు రూ.లక్ష వరకు సదరు ప్రిన్సిపల్ సంపాదించినట్లు తెలుస్తోంది. ఒకరి ద్వారా ఒకరికి పాకి వేలాది మంది అందులో సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటి వరకు మోసపోయామని ఎవరూ పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేయలేదు. కానీ ఆ యాప్ సేవలు ఆగిపోవడంతో పోలీసులను ఆశ్రయించాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మార్కాపురం డివిజన్‌లో రూ.10కోట్లకుపైగానే శఠగోపం


గతంలో మోసాలకు గురైనా నేర్వని గుణపాఠం

చెన్నై కేంద్రంగా పనిచేసిన హిమ్ అనే మని సర్క్యులేషన్ సంస్థ చేసిన నిర్వాకంతో 2011లో మార్కాపురం ప్రాంతంలో లక్షలాది మంది మోసపోయారు. అదంతా అప్పట్లో మనుషుల ద్వారా డబ్బులు సేకరించి సంస్థకు పంపే విధానంలో నడిచింది. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా అప్పట్లో కేవలం మార్కాపురం డివిజన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లు రూ.100 కోట్లకు పైగా నష్టపోయారు. హిమ్ సంస్థ కూడా మొదట్లో కొంతమేర సభ్యులకు చెల్లింపులు చేసింది. ప్రజల నుంచి ఎక్కువ మొత్తంలో సేకరించిన తర్వాత బోర్డు తిప్పేసింది. అప్పట్లో పేద, మధ్యతరగతి వర్గాలతోపాటు ఉన్నత వర్గాలకు చెందిన వాళ్లు కూడా భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా అవి నీటి మీద రాతలే అయ్యాయి. హిమ్ తర్వాత మరో రెండు సంస్థలు కూడా ఆశల వల విసిరి మోసాలకు పాల్పడ్డాయి.

స్కీం వివరాలు ఇలా...

స్కీమ్ గురించి తెలుసుకుంటే ఒక్క రూపాయి కడితే రూ.7, రూ.100 కడితే రూ.700, ఇలా చెల్లిస్తామంటూ మధ్యతరగతి వారిని ఆసరాగా చేసుకొని వలవిసిరారు. వారి స్కీమ్ మాయలోపడి భారీ ఆదాయం వస్తుందన్న ఆశతో వేలమంది పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. మొదట్లో బాగానే డబ్బులు వచ్చాయి. అయితే రెండురోజుల నుంచి డబ్బులు రావడం లేదు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. దీని యజమాని ఎవరో, ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. చెన్నై కేంద్రంగా కేవలం ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లింపులు జరిగాయి. ఈ స్కీమ్ చైన్ లింకు. సిస్టమ్‌లో మొదటి వ్యక్తికి లింకు పంపిస్తారు. ఆ వ్యక్తి మరో కొంతమందిని చేర్పిస్తే వారికి లింకు పంపిస్తారు. దీనిలో బ్యాంక్ అకౌంట్ లింకు చేసుకోవాలి. ఉదాహరణకు రూ.500 కడితే మరుసటి రోజు రూ.3500 అకౌంట్‌లో జమ అవుతుంది. దీంతో 30వేల మంది సభ్యులుగా చేరి దాదాపు రూ.10కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది.

స్కీమ్ ఎత్తివేస్తే పరిస్థితి ఏమిటని పలువురు చెప్పినా ఏమీ కాదు పోతే పోతాయి, లేకపోతే మా డబ్బులకు లాభం వస్తుంది కదా అని కొందరు చెబుతున్నారు. కొంతమంది అప్పులు చేసి మరీ స్కీమ్‌లో చేరారు. ఈ విషయంపై కంభం ఎస్సై పులి రాజేష్‌ను వివరణ కోరగా స్కీమ్ పేరుతో తాము మోసపోయామని బాధితులు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేస్తే వెంటనే విచారిస్తామని చెప్పారు.



చూరకూ డిమాండ్


కిలో రూ.180.. మేలురకం కిలో రూ.360

సాధారణ పొగాకుతో పోటీపడుతున్న ధరలు

పోటీపడి కొనుగోలు చేస్తున్న పలు కంపెనీలు

పలు కేంద్రాల్లో అనుమతించిన మేరకు

పంట విక్రయం పూర్తి



ఒంగోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పొగాకు చూర కూడా సాధారణ పంటతో పోటీ పడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకుతుండగా నాణ్యత ఏమాత్రం లేని లోగ్రేడ్‌లు సైతం రూ.200పైనే ఉంటున్నాయి. అదేసమయంలో పొగాకు చూరకు కూడా భారీ డిమాండ్ ఏర్పడింది. గరిష్ఠంగా కిలో రూ.180 వరకు నమోదవుతుండగా నాసిరకం కూడా రూ.130పైనే పలుకుతోంది. అంతేకాక సాధారణ పొగాకు బేళ్ల కోసం పోటీపడినట్లే చూర కోసం కూడా పలు కంపెనీల బయ్యర్లు పోటీ పడుతుండటం విశేషం. ప్రస్తుతం పలు వేలం కేంద్రాలలో బోర్డు నిర్దేశిత మేర కొనుగోళ్లు పూర్తి కావడంతో అధికారులు చూర బేళ్ల విక్రయాలకు అనుమతించారు. రెండు రోజులుగా పలు కేంద్రాల్లో చూర కొనుగోళ్లు జరుగుతుండగా వాటికి కూడా డిమాండ్ కనిపిస్తోంది. గతంలో చూర కొనుగోళ్లు వేలం కేంద్రాలలో జరిగేవి కావు. గ్రేడ్ చేసిన వివిధ రకాల బేళ్లను మాత్రమే కొనేవారు. మొత్తం బేళ్లను నాణ్యతను బట్టి మేలురకం, మీడియం, లో గ్రేడ్‌లుగా విభజించేవారు. వాటి నాణ్యతను బట్టి ధరలు లభించేవి.

గతంలో పడేసేవారు

సాధారణంగా పొగాకు గ్రేడింగ్ సమయంలో చూర వస్తోంది. కాల్పు సమయంలో ఆకు అధికంగా కాలడం లేదా నాణ్యత సరిలేక పెళుసుగా ఉన్న చోట గ్రేడింగ్ సమయంలో ముక్కలు, ముక్కలుగా రాలి పడుతుంది. ఏ రోజు కారోజు గ్రేడింగ్ తర్వాత దానిని గతంలో నయ్యిదిబ్బల్లో రైతులు వేసేవారు. బ్యారన్‌కు కనీసం నాలుగైదు క్వింటాళ్ల ఇలా చూర వచ్చేది. దానివల్ల ఆర్థికంగా రాబడి ఉండేది కాదు. అలాగే పొగాకు తోటల్లో రెలుపు ప్రక్రియ పూర్తి సమయంలో చివర రెండు, మూడు ఆకులు వదిలేసేవారు. టాప్‌లీఫ్ పేరుతో దీనిని వేలం కేంద్రాల వెలుపల కిలో రూ.15 నుంచి 20కి ప్రైవేటుగా కొనేవారు. అలాంటిది రెండేళ్లుగా చూర, టాప్‌లీఫ్‌లను కూడా వేలం కేంద్రాలలో కొనుగోలు చేస్తున్నారు. మంచి ధరలు కూడా వస్తున్నాయి. సిగరెట్ తయారీలో వీటి వాడకం వల్ల పలు కంపెనీల వారు సాధారణ పొగాకుతో సమనంగా వీటిని కూడా కొనుగోలు చేస్తున్నారు. అలా ఈ ఏడాది కూడా వేలం కేంద్రాలలో చూర కొనుగోళ్లకు బోర్డు అనుమతించింది.

అనుమతి వస్తే అధిక ఉత్పత్తి కొనుగోలు

ఇప్పటిదాకా ఆయా వేలం కేంద్రాలలో సాధారణ పంట కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది అనుమతి ఇచ్చిన దాని కన్నా దాదాపు 60శాతం అధికంగా ఉత్పత్తి జరిగింది. అధిక ఉత్పత్తి పంట కొనుగోలుకు ప్రత్యేకంగా బోర్డు అనుమతి ఇవ్వాల్సి ఉంది. అధికపంటపై అపరాధ రుసుం రద్దు కోసం కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. అక్కడి నుంచి క్లియరెన్స్ వచ్చాక అధిక ఉత్పత్తి పంట విక్రయాలు చేసే అవకాశం ఉంది. ఈలోపు చూర విక్రయాలను బోర్డు చేపట్టింది. రెండు, మూడు రోజులుగా ఒంగోలు-1, -2, వెల్లంపల్లితో పాటు పలు ఇతర కేంద్రాల్లో చూర కొనుగోళ్లు జరుగుతున్నాయి. కాగా సాధారణ పొగాకుకు ఈ ఏడాది ఊహించని రీతిలో డిమాండ్ ఏర్పడి భారీగా ధరలు పలుకుతున్న విషయం విదితమే. గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకుతుండగా, సగటు ధరలు కూడా రూ.254 వరకు ఉన్నాయి. అదే రీతిలో చూరకు కూడా మంచి ధరలు లభిస్తున్నాయి. గరిష్ఠ ధర కిలో రూ.180 వరకు ఉండగా సగటున రూ.150 మేర లభిస్తోంది. ఒక్కొక్క బ్యారన్‌కు నాలుగైదు క్వింటాళ్ల చూర వస్తుండగా ప్రస్తుత ధరతో బ్యారన్‌కు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు రాబడి రానుంది. గతంలో నయ్యిదిబ్బల్లో వేసే చూరకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఏర్పడటంతో రైతులు ఊరట చెందుతున్నారు

పీడీసీసీ బ్యాంకు పీఐసీగా జేసీ

ఒంగోలు(విద్య), జూన్ 27 : ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికార పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ)గా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో గత ఆరేళ్లగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. 2018తో సొసైటీల పదవీకాలం ముగియగానే నాన్ అఫిషియల్ కమిటీలను రంగంలోకి తెచ్చారు. వైసీపీ గత ఐదేళ్ల కాలంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఇప్పటివరకు నాన్ అఫిషియల్ నామినేటెడ్ కమిటీలతోనే కాలయాపన చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినేటెడ్ నాన్ అఫిషియల్ కమిటీల రాజీనామాలు స్వీకరించి అఫిషియల్ పీఐసీలను నియామకం చేపట్టారు. ప్రస్తుతం బ్యాంకు పీఐసీగా నియమితులైన జేసీ ఆరునెలల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారు. నూతన పాలకవర్గం ఎన్నికలయ్యేంత వరకూ ప్రతి ఆరునెలలకు వీరి పదవీ కాలాన్ని పొడిగించుకుంటూ పోతారు.



చిక్కిన చిరుత

24 గంటలపాటు శ్రమించి పట్టుకున్న

అటవీశాఖ సిబ్బంది

భయంతో వణికిపోయిన

దేవనగరం ప్రజలు

మెయిన్‌లో...

మార్కాపురం డీఎల్‌పీవో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్

మహిళా ఉద్యోగిపై వేధింపులను

వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి



ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27: మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించడంతోపాటు, కార్యాలయ నిర్వహణలో అలసత్వం వహించినందుకు మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి జి.నాగేశ్వరరావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కె.కన్నబాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాగేశ్వరరావు మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేయడంపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కూడా ఓ మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా అలసత్వం వహించారు. కలెక్టర్ విచారణలో ఈ రెండు విషయాలు నిగ్గుతేలడంతో ఆ మేరకు అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. నివేదికను పరిశీలించిన కమిషనర్ డీఎల్‌పీవో నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి మహిళా ఉద్యోగినిని వేధింపులకు గురిచేయడాన్ని ఉన్నతాధికారులు పెద్ద నేరంగా పరిగణించారు. ఈ ఉత్తర్వులపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు.

కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ

అధికార, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా బాధ్యతలు స్వీకరించారు. అన్సారియాను జిల్లా కలెక్టర్‌గా నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం పదిన్నర గంటలకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో బుధవారం రాత్రి ఒంగోలు చేరుకున్న తమీమ్ ఎన్‌ఎస్‌పీ అతిథిగృహంలో బస చేశారు. గురువారం ఉదయం ఎన్‌ఎస్‌పీ అతిథిగృహంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం పదిన్నర గంటలకు అన్సారియా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం నూతన కలెక్టర్‌ను కలిసి అభినందించేందుకు వచ్చిన జిల్లా అధికారులను జేసీ పరిచయం చేశారు. వివిధ శాఖల అధికారులు రవికుమార్, వెంకటేశ్వర్లు, ఉషారాణి, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సెక్షన్ల సూపరింటెండెంట్లు, వారి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఉద్యోగ సంఘాలతో పాటు వివిధ సంఘాల నాయకులు కూడా కలిసి అభినందించారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న ఎస్పీ, జేసీ

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అదేవిధంగా మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు నూతన కలెక్టర్‌ను కలిసి అభినందించారు.



బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అన్సారియా

మీకోసం అర్జీలను సహేతుకంగా పరిష్కరిస్తాం

జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయి పర్యటనలు

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

24/7 ప్రజలకు అందుబాటులో ఉంటా

నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా

వెలిగొండను పూర్తిచేస్తాం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27: జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మీకోసం అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపైనా దృష్టిపెడతామని తెలిపారు. జిల్లాలో ఉన్న తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా అవగాహన పెంచుకుంటానని వివరించారు. జిల్లాస్థాయిలోని సమస్యలను వీలైనంత వరకు స్థానికంగా, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్య, వైద్యం పారిశుధ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారిత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషిచేస్తానని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తాను 24/7 అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఫోన్ కూడా చేయవచ్చని తెలిపారు. లేనిపక్షంలో వాట్సాప్, ట్విట్టర్, ఈమెయిల్‌లో కూడా ఆయా సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని అన్సారియా చెప్పారు.



టంగుటూరు వేలం కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు కొనుగోళ్లు

టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర రూ.359

టంగుటూరు, జూన్ 27 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన కొనుగోళ్లలో పొగాకు గరిష్ఠ ధర రూ.359 రైతులకు దక్కింది. టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి గురువారం కాకుటూరివారిపాలెం, తూర్పునాయుడుపాలెం రైతులు 1,188 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. వీటిల్లో 1,124 బేళ్ల కొనుగోలు జరగగా మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరించారు. వీటిలో 19 బేళ్ల ఎన్‌బీ కాగా, ఆర్‌ఆర్-8, సీఆర్ 32 బేళ్లకు జరిగింది. రైతులకు గరిష్ఠ ధర రూ.359 కాగా కనిష్ఠ ధర రూ.205 వద్ద నిలకడగా కొనసాగుతుంది. సరాసరి ధర రూ.292.30కు చేరుకున్నట్లు రైతులు తెలిపారు. వేలంలో 22 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ ఏడాది ఉత్పత్తి వ్యయం రెండింతలకు పెరిగి గిట్టుబాటు ధరలు వస్తాయో, రావో అని అనుమానిస్తున్న రైతులకు ప్రస్తుత ధరలు కొంతమేర ఉపశమనం కలిగిస్తున్నాయి.

ముగిసిన అధికారిక కోటా అమ్మకాలు

- వేలంలో రూ.258 కోట్ల విక్రయాలు
- 9.92 మిలియన్ పొగాకు విక్రయాలు

సంతనూతలపాడు, జూన్ 27: మండలపరిధిలోని పేర్నమిట్ట సమీపంలోని ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో గురువారంతో అధికారిక కోటా అమ్మకాలు ముగిసినట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. ఇప్పటివరకు 9.92 మిలియన్ పొగాకు విక్రయాలు జరిగినట్లు తెలిపారు. దీనిలో బ్రైట్ గ్రేడ్ 17.02 శాతం, మీడియం గ్రేడ్ 24.48 శాతం, తక్కువ గ్రేడ్ భాగం 58.50 శాతం విక్రయాలు జరిగాయని ఆయన వివరించారు. ఇప్పటివరకు సరాసరి ధర రూ.260.17లు పలకగా అధికధర రూ.362, అత్యల్ప ధర రూ.205 వచ్చినట్లు తెలిపారు. సుమారు రూ.258 కోట్ల పొగాకు విక్రయాలు జరిగినట్లు తెలిపారు. 91రోజుల పాటు జరిగిన వేలంలో 48 కంపెనీలు పాల్గొన్నాయి. సోమవారం నుంచి పొగాకు చూర, ముక్క అమ్మకాలు ప్రారంభమవుతాయని తెలిపారు.



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్ సునీల్

పోలీసులు జవాబుదారీగా పనిచేయాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు క్రైం, జూన్ 27: పోలీసులు ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ కోరారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న తీవ్రమైన కేసులను సమీక్ష చేసి దర్యాప్తులో అవలంబించాల్సిన సూచనలను చేశారు. ఈనెల 29న జరగనున్న లోకఅదాలత్ రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు సత్వరం పరిష్కారం చేస్తూ పారదర్శకంగా పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచాలని కోరారు. సిబ్బంది సంక్షేమం విషయంలో అధికారులు వేగవంతంగా స్పందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు యంత్రాంగం సమష్టిగా కృషిచేసిందని అభినందించారు. అంతేకాకుండా పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేసారు. ఎన్నికల విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అదనపు ఎస్పీలు కే.నాగేశ్వరరావు, ఎస్‌వీ.శ్రీధరరావు, డీఎస్పీలు రామరాజు, అశోక్‌వర్ధన్, బాలసుందరం, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖరరావు, పలువురు సీఐలు, ఎస్సైలు సిబ్బందిని ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా అర్ధవీడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా ఆధారాలు సేకరించిన కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై ఎం.అనిత, కోటయ్య కానిస్టేబుళ్ల లక్ష్మీనాయక్, హోంగార్డు ఎమ్.నాగరాజులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావుతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న కళాకారులు

అమరావతిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటుచేయాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 27: రాజధాని అమరావతిలో అమరగాయకుడు ఘంటసాల భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పలు అంశాలతో కూడిన కరపత్రాన్ని గురువారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కళలకు, కళాకారులకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చే ప్రభుత్వం రాష్ట్రంలో పాలనకు వచ్చిందని అన్నారు. అమరావతిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయటం, కృష్ణానదికి ఇరువైపులా ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు, మేధావుల విగ్రహాలను ఏర్పాటుచేయాలన్నారు. అదేవిధంగా ఘంటసాల వెంకటేశ్వర రావు, ఎన్టీ రామారావులకు భారతరత్న ప్రకటించాలని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఘంటసాల విగ్రహ సాధన కమిటీ ఒంగోలు శాఖ కన్వీనర్ ఎస్.కె.బాబు, ధేనువకొండ వెంకట సుబ్బారావు, యు.కోటేశ్వరరావు, లక్ష్మీ తులసి, నిర్మలమ్మ, యశోద, రంగారెడ్డి, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు పాలొన్నారు.

శ్రీగిరి ఆర్జిత సేవల ధర్మకర్త రామారావు మృతి



రామారావు (ఫైల్)

ఒంగోలు(కల్చరల్), జూన్ 27: స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరి జ్వాలా రామారావు (78) గురువారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఒంగోలులో విద్యాభ్యాసం చేసి రోడ్లు భవనాల శాఖలో ఉన్నతాధికారిగా పదవీ విరమణ చేసిన జ్వాలా రామారావు, శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. జ్వాలా రామారావు మృతి తీరని లోటని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు వెంకటేశ్వర రావు, లక్ష్మీకుమారి, జైశంకర్, దేవస్థాన సిబ్బంది, అర్చక బృందం నివాళులు ప్రకటించారు. రామారావు అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

మాజీ మంత్రివి సిగ్గుమాలిన విమర్శలు

మంత్రి స్వామిపై అసత్యాలు మాట్లాడటం తగునా?

ఇలాగే అవాకులు చవాకులు పేలితే బుద్ధిచెప్తాం

టీడీపీ ఎస్సీసెల్ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

సింగరాయకొండ, జూన్ 27 : సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిపై, టీడీపీ నాయకులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌కు తగిన బుద్ధి చెప్తామని సింగరాయకొండ మండల టీడీపీ ఎస్సీసెల్ నాయకులు హెచ్చరించారు. గురువారం టీడీపీ స్థానిక కార్యాలయంలో ఎస్సీసెల్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి సురేష్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రంలోని దళితులపై దాడులకు పాల్పడి పలువురి అతికిరాతకంగా హత్య చేసినా.. దళిత మంత్రిగా ఉండి సురేష్ కనీసం నోరుపెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీవిద్య పథకాన్ని జగనన్న విద్యాపథకంగా పేరు మార్చినపుడు దళిత మంత్రిగా మీ గొంతు మూగబోయిందా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో పేద విద్యార్థులకు ఆధారమైన గురుకుల పాఠశాలలో సీట్లు రద్దుచేస్తే వాటి గురించి ఎన్నడూ స్పందించలేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా డాక్టర్ స్వామి పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే సింగరాయకొండ గురుకుల పాఠశాలలో సైన్సు గ్రూపులో వైసీపీ రద్దుచేసిన 80 సీట్లను పునరుద్దరిస్తూ తొలి సంతకం చేశారని అది ఆయన చిత్తశుద్ధన్నారు. జగనన్న విదేశీ విద్యాపథకాన్ని మళ్లీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీవిద్యగా టీడీపీ ప్రభుత్వం పేరుమార్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శి చంటి, పోనుగోటి కొండయ్య, సుదర్శి బాలకోటయ్య, నూతలపాటి చైతన్య, గర్నిపూడి సుబ్రమణ్యం, అంబటి కోటేశ్వరరావు, పొట్లూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇన్నాళ్ల మూగనోము ముగిసిందా

కొండపి : జగన్ పాలనలో దళితుల పథకాలకు కోత పెట్టినా, దళితులపై దాడులు చేసినా, అంబేడ్కర్ పేరు తీసేసి పథకాలకు జగన్ పెట్టుకున్నా నోరు మెదపకుండా మూగనోము పాటించిన మాజీ మంత్రి సురేష్ ఇపుడు దళితులపై కపట ప్రేమ ఒలకబోయడం, టీడీపీ కూటమి ప్రభుత్వంపై, సాంఘిక సంక్షేమశాఖ మంత్రిపై విమర్శలు చేయడం సిగ్గుమాలినతనానికి నిదర్శనమని ఎస్సీ, ఎస్టీసెల్ జిల్లా మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు యనమద్ది వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. సింగరాయకొండలో మాజీ మంత్రి సురేష్ జనం మర్చిపోతారనే ఉద్దేశంతో వచ్చి ప్రభుత్వంపై, మంత్రి స్వామిపై అవాకులు, చవాకులు పేలడం తగదన్నారు. జనం ఛీకొట్టి ఓడించినా ఇంకా తగుదునమ్మా అంటూ సురేష్ పత్రిక ప్రకటనలు విడుదల చేయడం శోచనీయమని పేర్కొన్నారు.

నూతన కలెక్టర్‌కు పలువురి అభినందనలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి కలిసి బొకే ఇచ్చి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఉషారాణి ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందిని కలెక్టర్‌కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో కార్యాలయ ఏవో శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జీ రామకృష్ణతో పాటు ఇతర ఉద్యోగులు ఉన్నారు. కాగా ఒంగోలు డీఎల్‌పీవో పద్మ ఆధ్వర్యంలో ఆమె కార్యాలయ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి అభినందించారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బొకే ఇస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు

డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు కలిసి బొకే ఇచ్చి అభినందించారు. గురువారం స్థానిక కల్టెరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వి. ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి. పోలురాజు, ఎస్‌కే ఖాదర్ మొహిద్దీన్ బాషా తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్సారియాకు బొకే ఇస్తున్న డీపీవో ఉషారాణి, ఏవో శివప్రసాద్

ఉద్యోగ సంఘాల నేతల అభినందనలు

ఏపీ రెవెన్యూ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ ఆర్వీ ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు నూతన కలెక్టర్ అమీమ్ అన్సారియాను కలిసి అభినందించారు. ఈసందర్భంగా ఆమెకు బొకే ఇచ్చి అభినందించారు. జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వరరెడ్డి, అసోసియేషన్ నాయకులు జే డానియేలు, ఊతకోలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరాజు, జయలక్ష్మి, ప్రసన్నాంజనేయకుమార్, ఆంజనేయులు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు, రెవెన్యూ సహాయకుల సంఘం నాయకుడు ఎలీషా తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కలెక్టర్ అన్సారియాకు బొకే ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, మసూద్ అలీ, రంగారెడ్డి, కాట్రగడ్డ మానస, కాట్రగడ్డ శ్రీదేవి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు ఉన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. రంగయ్య, ఏసీ ఆదిరెడ్డిల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి అభినందించారు. ముందుగా ఆమెకు బొకే ఇచ్చి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి. జానయ్య, కే రవికుమార్, రమణి, వినీల, వెంకట రమణయ్య రమేష్, వాసంతి తదితరులు ఉన్నారు.



నూతన కలెక్టర్‌కు బొకే ఇచ్చి అభినందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఇంటర్ ఫలితాల్లో హర్షిణీ విజయకేతనం

ఒంగోలు(విద్య), జూన్ 27 : ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ హర్షిణీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయభేరి మోగించారు. ఎంపీసీ విభాగంలో నూతలపాటి బ్లెస్సీ, రావి యశ్విత, పీడీ ప్రసాద్‌లు 470కి 465 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో సిగంశెట్టి సాయి దుర్గ 500లకు 475, ఎ. రవీంద్ర 469 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈసీ విభాగంలో నున్న సుహాని 500లకు 468, బైపీసీలో కే హారిక, ఎస్‌కే కౌశల్ 429 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కరస్పాండెంట్ గోరంట్ల కవితలు అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎమ్మెస్సార్, దివి రమేష్, నారాయణ, ఏవో శేఖర్, శ్రీనివాసరావు, కళాశాల డీన్ దాది ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ విభాగంలో రాయవరపు వెంకట నాగగోదాలక్ష్మీదేవి 465, పావులూరి మంజు అజిత శ్రీ, సన్నె బోయిన హేమలతలు 465 మార్కులు, మీసాల వెంకట నాగసాయి, కనుమూరి ప్రవల్లిక, మద్దిపాటి మేఘన కుంచాల భాను శంకర్‌రెడ్డిలు 463 మార్కులు, తిరగాబత్తిన స్వాతి 460, మన్నెం లిఖిత 461, ఖాజా నిఖిత చంద్రకళ 460 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో వర్రె సుస్మిత 432, శంకరమంచి నాగ వైష్ణవి 431, వల్లూరి భవ్యశ్రీ 427 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డీన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

జీవో 117 ను రద్దు చేయాలి

నాగులుప్పలపాడు, జూన్ 27 : పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే జీవో నంబర్ 117 ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జేవీఆర్.ఖషీరున్నీసా డిమాండ్ చేశారు. కనపర్తి జడ్పీ హైస్కూల్‌లో గురువారం చేపట్టిన ఆ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షణీయమన్నారు.విద్యారంగ సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.తిరుమల, మండల అధ్యక్షులు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి మౌలాలి, వి.రామారావు, కట్టా వెంకటేశ్వర్లు,సంజీవకుమార్, ఐ.ప్రసాద్, ఐవీ సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

నాగులుప్పలపాడు, జూన్ 27 : రైతులకు సాగు అవసరాల కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం పంట రుణాలను అందివ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి కోరారు.స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ని అమలు చేయాని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ. 20 వేలు ఈ ఏడాది ఖరీఫ్ నుంచే అందించాలన్నారు. కౌలు రైతులకు పావలా వడ్డీకే రుణాలు అందించాలని,సాగునీటి ప్రాజెక్టుల కాలువలను అభివృద్ధి చేయాలని,స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఆ వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో చెరుకూరి వాసు, పోకూరి వెంకటేశ్వర్లు, ఎన్. లక్ష్మీనారాయణ, కనపర్తి ఇర్మియా, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, జూన్ 27: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్ర వద్ద గురువారం మోటార్‌బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ఒంగోలు నుంచి అద్దంకి వైపు వెళుతున్న మోటార్‌బైక్ కారును అధిగమించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పి.సునీల్ కుమార్, అనుసూయమ్మకు గాయాలు కాగా అద్దంకి ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 700 ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు ఉండగా 3,629 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 173 డిగ్రీ కళాశాలల్లో 630 మంది కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని, వీరందరికి రెండు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల కాంట్రాక్టు లెక్చరర్లను వెంటనే రెన్యూవల్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పీఎఫ్‌తో బహుళ ప్రయోజనాలు

ఒంగోలు(విద్య), జూన్ 27 : భవిష్యనిధి(పీఎఫ్) వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నందున ఉద్యోగులందరూ భవిష్యనిధి చందాదారులు కావాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. పీఎఫ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నిధి ఆప్‌కెనిఖిత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం. నమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆఫ్‌కెనిఖితపై వివరించారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ కృషి, కొత్త మార్పులను వివరించారు. ఈకార్యక్రమంలో వివేద రిసార్ట్ ఎండీ గోవిందరెడ్డి, జనరల్ మేనేజర్ షణ్ముఖ, రామారావు, శ్రీను, సత్యనారాయణలు పాల్గొన్నారు. వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేశారు.

సీనియర్ సిటిజన్లకు హెల్మెట్ నిబంధన సడలించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : సీనియర్ సిటిజన్స్‌కు హెల్మెట్ నిబంధనలను సడలించాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో కోరారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో హైవేలలో ప్రయాణించేసేవారు నిబంధనలు పాటించాల్సి ఉందన్నారు. అసలు డ్రైవింగ్ చేతకాని వారు, తాగి డ్రైవింగ్ చేసే వారి వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పట్టణాల్లో తిరిగే సీనియర్ సిటిజన్స్‌కు ఈ నిబంధనను సడలించాలని ఆయన కోరారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న మండల విద్యాశాఖాధికారి పద్మావతి, డాక్టర్ వంశీకృష్ణ, శాంతకుమారి

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూన్ 27: మండలంలోని కె. పల్లెపాలెంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం సాయంత్రం ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి అవసరమైన అన్ని రకాల నోట్ పుస్తకాలను సొంతంగా తయారు చేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు. గత కొన్నేళ్ళుగా ప్రభుత్వపాఠశాలల్లో చదువుతూ మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినీవిద్యార్థుల ఫొటోలతో ప్రత్యేకంగా కవర్‌పేజీపై ముద్రించిన నోట్ పుస్తకాలను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అనితా రోజ్‌రాణి, మండల విద్యాశాఖాధికారి పద్మావతి, కొత్తపట్నం జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, కె. పల్లెపాలెం ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయులు మస్తాన్, కృష్ణప్రసాద్, తిరుమలాబి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సూచించిన నివారణ పద్ధతులను పాటించాలన్నారు. శుభ్రమైన, సురక్షితమైన నీటిని తాగాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మరుగుదొడ్లను విధిగా ఉపయోగించాలని సూచించారు. తల్లిపాలు తాగే శిశువులకు అతిసార సోకినట్లయితే తల్లి పాలు ఇవ్వడం మానకూడదని, తగినంత పోషక అనుబంధ ఆహారంఇవ్వాలన్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా తీసుకొని ఆ మిశ్రమాన్ని ఒక లీటరు నీటిలో కలిపి అతిసార అయిన ప్రతిసారి ద్రావణం తాగిస్తూ ఉండాలన్నారు. అతిసార నివారణ, సహాం కోసం ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు అందుకోసం 9515324799 నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తున్న దాత కోటేశ్వరరావు

పిల్లలను బడిలో చేర్పించాలి

నాగులుప్పలపాడు, జూన్ 27 : బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్, ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈమని రమణయ్య సూచించారు. గురువారం కె.తక్కెళ్ళపాడులో వారు పాఠశాల విద్యార్థులతో కలిసి నేను బడికిపోతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు బాల కార్మికులుగా మారకుండా తల్లిదండ్రులు చైతన్యంతోతమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదని బడిలో చక్కగా చదువుకోవాలని వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దాత నల్లూరి కోటేశ్వరరావు విద్యార్థులకు నోట్ బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రామ్మోహన్, హెచ్.ఎం రమేష్, ఉపాధ్యాయులు,పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు నివాళులు

టంగుటూరు, జూన్ 27 : టీడీపీ అధికారం చేపట్టడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావడంతో మొక్కులు తీర్చుకునేందుకు విజయవాడ నుంచి తిరుపతి వేంకటేశ్వర సన్నిధికి కొందరు టీడీపీ సానుభూతిపరులు కాలినడకన బయలు దేరారు. వీరంతా ఈనెల 22న ఉదయం విజయవాడలో కదలి గురువారం ఉదయానికి టంగుటూరు చేరుకున్నారు. టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి నివాళులర్పించారు. ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న శ్రీనివాసరాజు మాట్లాడుతూ తాము మొక్కుకున్నట్లు టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినందుకు తిరుపతి వెంకన్నకు మొక్కులు చెల్లించేందుకు బయలుదేరామని చెప్పారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితాలు

ఒంగోలు(విద్య), జూన్ 27 : జిల్లాలోని హైస్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు డీఈవో ప్రకాశం వెబ్‌సైట్‌లో ఉంచినట్లుడీఈవో డి.సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులకు తెలియజేయాలన్నారు అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాలను కూడా వారికి అందజేయాలన్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిశీలించి జాబితాలో ఏమైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరిచేసి అందుకు సంబంధించిన ఆధారాలతో నిర్ణీత ప్రొఫార్మాలో ఈనెల 29వతేదీ సాయంత్ర ఐదు గంటల లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సుభద్ర కోరారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్‌జాబితా విడుదల

ఒంగోలునగరం, జూన్ 27: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో తుది మెరిట్ జాబితాను గురువారం విడుదల చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన గ్రూపు 4, టెక్నికల్, క్లాస్ 4 పోస్టుల అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రకాశం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 30వ తేదీలోగా జాబితాను పరిశీలన చేసుకోవాలని ఆ మె కోరారు. అభ్యర్థులు తమ వివరాల కోసం 28వ తేదీ నుంచి జాబితాను వెబ్సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు.

నేడు మంత్రి పర్యటన

పొన్నలూరు (కొండపి), జూన్ 27 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం పొన్నలూరు మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం పది గంటలకు పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. తదనంతరం 11 గంటలకు వెలుగు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : ఒంగోలు లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోజు ఉదయం 8గంటలకు స్థానిక మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10.30 గంటలకు పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరిగే జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.

30న జిల్లా చదరంగ పోటీలు

ఒంగోలు(విద్య), జూన్ 27 : జిల్లా స్థాయి బాలబాలికలకు చదరంగ పోటీలు ఈనెల 30న స్థానిక నెక్ట్స్‌జన్ ఇంటర్నేషనల్ స్కూలులో నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరి షేక్ అబ్దుల్ నబీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి నలుగురిని రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు పంపుతామన్నారు. 2005 జనవరి 1తర్వాత జన్మించిన వారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఆసక్తిగల వారు 9666725719 నెంబరును సంప్రదించాలని కోరారు.

రిసార్టుల అనుమతులపై ఆరా..!

» నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలేంటి..?

» ఆరంభ శూరత్వమేనా ... అంతిమంగా కొనసాగేనా...?

చీరాల, జూన్ 27 : గత వారం, పది రోజులుగా తీర ప్రాంతంలో రిసార్టుల నిర్వాహకుల తీరు, తెన్నులు, జరుగుతున్న ప్రాణనష్టంపై ప్రభుత్వం స్పందించింది. అధికారులు తగిన కార్యాచరణతో పని చేస్తున్నారు. అయితే కార్యాచరణ అమలు ఎప్పటి నుంచి అనే విషయమై స్పష్టత లేకపోవడంపై ప్రజలు, పర్యాటకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రమంలో రిసార్టులకు సంబంధించిన ఆయా శాఖల అనుమతులు ఎవరెవరికి ఉన్నాయి. ఎవరికి లేవు. లేని వారిపై ఎలాంటి చర్యలు చేపట్టవచ్చునే కోణంలో ఆరా తీసిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిజాయతీగా పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామనే భావనతో చర్యలు చేపట్టిన పాలకులు, అధికారులుపై ఆరోపణలు చేస్తూ కొందరు రిసార్టుల నిర్వాహకులు తమ స్వరం వినిపిస్తున్నారు. దీంతో సదరు వ్యక్తుల ఆరోణలకు రుజువులు చూపాలి. లేదంటే వారి కుంచిత స్వభావానికి ఎవరిపై ఆరోపణలు చేశారో వారికి క్షమాపణలు చెప్పాలని తీరప్రాంత ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఇలాంటి అభాండాలు, ఆరోపణలు వండి వార్చి ఎలాంటి రక్షణ, అభివృద్ధి చర్యలకు సంబంధీకులు అడుగులు వేయకుండా ఎదురు దాడి చేసేవారికి చెక్ చెప్పాల్సిన అవసరం ఉందంటున్నారు.


హైకోర్టుకు కేటాయించిన స్థలం నుంచి వేసిన దారి

వైజాగ్ కన్నా మిన్నగా..

ఆంధ్రా గోవాగా బాపట్ల, చీరాల నియోజకవర్గాల పరిధి ఇవలోని తీరప్రాంతం అభివృద్ధి చెందేందుకు ఎంతో అవకాశం ఉంది. స్థానిక స్థితిగతులు, ఉన్న వనరులు అందుకు కారణం. అయితే ఆయా తీరప్రాంతాల్లో నెలకున్న పరిస్థితులు, జరుగుతున్న ప్రాణనష్టం అందరినీ కలవరపరుస్తోంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే సూర్యలంక నుంచి వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం వరకు ఉన్న తీరప్రాంతం పర్యాటకులకు ఆనందాన్నిచ్చే విధంగా ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల్లో ఉన్న రిసార్టుల్లో నూటికి 90 మందికి పూర్తిస్థాయి అనుమతులు లేవు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే వరకు వారి పేర్లు చెప్పి దందా సాగించేవారికి చెక్ చెప్పాలి.

వందకు పైగా రిసార్టులు.. పూర్తిస్థాయి అనుమతులు ఉంది నామమాత్రమే

జిల్లాలోని తీరప్రాంతంలో పూర్తి స్థాయి అనుమతులు ఉన్న రిసార్టులు నామమాత్రమే. సింహభాగం రిసార్టులకు పూర్తి స్థాయి అనుమతులు లేవు. అయినప్పటికీ సదరు రిసార్టుల నిర్వాహకులు ఎవరు అధికారంలో ఉంటే వారికి కొమ్ముకాస్తూ, ఏ ఎండకు ఆ గొడుగు అన్న చందంగా తమ పబ్బం గడుపుకుంటున్నారు. తాజాగా ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య రిసార్టులకు సంబంధించిన వ్యవహారాలను పక్కాగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. లేదంటే నిబంధనలు మేరకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కొండయ్యపై ఎదురుదాడి..

అనుమతులు లేని రిసార్టుల నిర్వాహకుల్లో ఓ వ్యక్తి ఎమ్మెల్యే కొండయ్యపై ఎదురుదాడికి దిగాడు. కొండయ్యకు మకిలి అంటించేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. అయితే ఇతర రిసార్టుల నిర్వాహకులు అతనికి మద్దతు తెలపకపోవడం విశేషం. తీరానికి వచ్చే పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే కొండయ్య సూచనలు పాటిస్తారా .. లేదంటే వేచిచూసే ధోరణిని కొనసాగిస్తారా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత సదరు రిసార్టుల నిర్వాహకులపై ఉంది. అంతిమంగా ఏ నిర్ణయాలు తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

హైకోర్టుకు కేటాయించిన స్థలం నుంచి రోడ్డు

రామాపురం, కఠారివారిపాలెం మధ్య తీరం వెంట ఉన్న రోడ్డుకు సమీపంలో నిర్మించిన ఓ రిసార్టు నిర్వాహకుడు ఏకంగా హైకోర్టు అవసరాలకు కేటాయించిన స్థలంలో తన రిసార్టుకు దారిని ఏర్పాటు చేసుకున్నాడు. ఇలాంటి అతిక్రమణలు తీరప్రాంతంలో పదులు కొద్దీ ఉన్నాయి. అలాంటివాటని క్రమబద్ధీకరించాల్సిన అవసరం పాలకులు, అధికారులపై ఉంది.

ఎదురుదాడికి దిగేవారిని ఉపేక్షించ కూడదు

ఒకవైపు తాము నిబంధనలు పాటించడం లేదని రిసార్టుల నిర్వాహకులకు తెలుసు. అయితే దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఓ రిసార్టు నిర్వాహకుడు కొందరిని కూడగట్టి ఎవరైతే ప్రక్షాళన చర్యలకు శ్రీకారం చుట్టారో వారిపై ఆరోపణలకు దిగి, వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది. అయితే వారి ఉడత ఊపులకు బెదరకుండా సంబంధీకుల తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.


మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమైన వైసీపీ నేతలు మాజీ మంత్రి నాగార్జున, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

బిల్లులు వచ్చేలా చూస్తాం..!

● కౌన్సిలర్లకు వైసీపీ నేతల హితబోధ

● అండగా ఉంటామని హామీ

చీమకుర్తి, జూన్ 27 : అందరూ కలిసికట్టుగా ఉండి ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండాలని వైసీపీ నేతలు కౌన్సిలర్లకు ధైర్యం చెప్పారు. మేము మీకు అండగా ఉంటాం.. బిల్లులు వచ్చేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో వైసీపీ కౌన్సిలర్లుందరూ ప్లేట్ ఫిరాయించిన నేపథ్యంలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జునలు మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లకు రావాల్సిన బిల్లులన్నీ వచ్చేవిధంగా కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా అధికార పక్షం వారు అజెండాలో అంశాలు చేరిస్తే వాటికి ఆమోదం తెలుపవద్దని సూచించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా అందరూ కలిసికట్టుగా ఉండి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ తరువాత మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు,ఎంపీటీసీలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. అధికారం పోయిందని అధైర్యపడవద్దని వారిని సముదాయించారు.

పోలీసుల ముందస్తు చర్యలు...

వైసీపీ నాయకులు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీస్ యంత్రాంగం అప్రమత్తమయింది .ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు మున్సిపల్ కార్యాలయంపై వైసీపీ నాయకుల పేర్లు తొలగించిన తరుణంలో కార్యాలయానికి వస్తున్న వైసీపీ నాయకులు కార్యాలయ ఆవరణలో ధర్నాకు దిగవచ్చన్న అనుమానంతో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పెషల్‌పార్టీ పోలీసులను జిల్లా కార్యాలయం నుంచి పిలిపించి సీఐ దుర్గాప్రసాద్,ఇద్దరు ఎస్ఐల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

ముండ్లమూరు, జూన్ 27: మండలంలోని మారెళ్ళ చెరువులో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతు న్నాయి. అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టుగా వ్యవ హరిస్తుండటంతో అక్రమార్కులకు అడ్డేలేకుండా పోయింది. ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో చెరువులో మట్టిని తవ్వి టిప్పర్లలో త రలిస్తున్నారు. ఈమట్టి కొందరికి కాసుల వర్షం కురిపిస్తుంది. ఇటీవల బసవాపురం చెరువులో కూడా ఈతంతు సాగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మారెళ్ళ చెరువులో కొనసాగుతున్న గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అద్దంకి మున్సిపల్ కార్యాలయం

వైసీపీ కౌన్సిలర్‌ల తీరు మారేనా..?

» అద్దంకి మున్సిపల్ సమావేశాలు సజావుగా జరిగేనా

» ప్రతి కౌన్సిల్‌లోనూ టీడీపీ కౌన్సిలర్‌లపై హేళన

అద్దంకి, జూన్ 27 : అద్దంకి మున్సిపల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్‌ల తీరులో ఇకనైనా మార్పు వస్తుందా.. లేక పాత పద్ధతినే కొనసాగిస్తారా అన్నది సర్వత్రా చర్చగా మారింది. మున్సిపల్ పాలక మండలిలో వైసీపీకి 13 మంది, టీడీపీకి 7 మంది కౌన్సిలర్‌లున్నారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు వైసీపీ అధికారంలో ఉండడం, మున్సిపాలిటీలోనే వైసీపీ కౌన్సిలర్‌ల బలం ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అందరు కౌన్సిలర్‌లు సమానమే అనే భావనే లేకుండా ఇష్టానుసారం వ్యవహరించారు. మున్సిపల్ సమావేశాలలో సైతం ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ కనీసం మహిళా కౌన్సిలర్‌లు అని కూడా చూడకుండా హేళనగా మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయి. అదే సమయంలో మహిళా కౌన్సిలర్‌లు మాట్లాడే సమయంలో కొందరు కౌన్సిలర్‌లైతే అత్యుత్సాహంతో రన్నింగ్ కామెంటరీ కూడా చేసారని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇక టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిధ్యం వహించే వార్డులలో అభివృద్ధి పనుల విషయమై ప్రస్తావనే లేకుండా పోయింది. టీడీపీ కౌన్సిలర్‌లు ఇచ్చిన సమస్యలను కనీసం అజెండాలో చేర్చేందుకు కూడా వైసీపీ కౌన్సిలర్లు ఇష్టపడని పరిస్థితి. అయితే ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారంలో ఉండడంతో పాటు ఇద్దరు వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీకి మద్దతుగా నిలబడడం, ఇంకా పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుండడం తో శుక్రవారం జరుగుతున్న మున్సిపల్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత పరిస్థితులలో గతంలో అత్యుత్సాహం చూపించిన వైసీ పీ కౌన్సిలర్‌లు తమ పంథా మార్చుకొని వ్యవహరిస్తారా లేక అదే పద్ధతిలో పో యి అభాసుపాలవుతారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. గతంలో అవమానా లు పడ్డ టీడీపీ కౌన్సిలర్‌లు శుక్రవారం నాటి మున్సిపల్ సమావేశంలో ఒకింత హవా సాగించే విధంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి మున్సిపల్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

డయేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలి

చీరాలటౌన్, జూన్ 27 : చీరాల మండల పరిధిలో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీ వో శోభారాణి అన్నారు. గురువా రం మండల కార్యాలయంలో ఆరో గ్య సిబ్బంది, వెలుగు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడు తూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వర్షాలు పడనున్న నేప థ్యంలో క్లోరినేషన్, క్లోరోస్కోప్ సేకరణ, డ్రై డే కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఆరోగ్య సిబ్బంది డ్రింకింగ్ వాటర్ సోర్స్ టెస్టింగ్ చేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్‌ఈవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రామ్‌కుమార్, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, డా.శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


నోటుపుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నేత పూనాటి వెంకట్రావు

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

చీమకుర్తి, జూన్ 27 : మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల, పాటిమీదపాలెం విద్యార్థులకు గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు.సీనియర్ టీడీపీ నాయకుడు పూనాటి వెంకట్రావు విద్యార్థులకు నోటుపుస్తకాలు,పలకలు తదితర విద్యాసామగ్రిని అందజేశారు.విద్యాభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందజేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.హెచ్‌ఎం షేక్ సిలార్‌సాహెబ్, ఉపాధ్యాయులు పూనాటి వెంకట్రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇస్తర ఏడుకొండలు, సంజీవి, కవిత, చందు, శ్రీను, వీరాంజనేయులు, వెంకట్రావు, యాదగిరి పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

కనిగిరి, జూన్ 27: మహిళలు సాధికార దిశగా రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనర సింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జననీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలలుగా 80 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. కుట్టు మిషన్‌లో మహిళలు ఎంతో రాణించినట్లు చెప్పారు.


మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అమరావతి రైతులకు ఘనస్వాగతం

పర్చూరుకు చేరిన పాదయాత్ర

పర్చూరు, జూన్ 27 : టీడీపీ ప్రజా కూటమి విజయం సాధించడం, నవ్యాంధ్ర రాజధానికి పూర్వ వైభవం తెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న చర్యలపై అమరావతి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవ దేవుళ్లకు, న్యాయ దేవుళ్లకు, ఓటరు దేవుళ్లకు వందనాలు అంటూ రైతులు చేపట్టిన కృతజ్ఞతా పాదయాత్ర గురువారం పర్చూరుకు చేరింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి వృద్ధులు, చిన్నారుల సైతం పాదయాత్రగా బయలు దేరి స్వామివారికి మొక్కు తీర్చుకోనున్నారు. ఐదేళ్ల రాక్షక పాలనకు ఓటరు దేవుళ్లు అంతం పలికారని పాదయాత్రకులు పేర్కొన్నారు. ఇక భవిష్యత్ అమరావతిదేనని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి పఠాన్ సమీర్ ఆధ్వర్యంలో నాయకులు, శ్రేణులు అమరావతి రైతులకు ఘనంగా స్వాగతం పలికారు.



పాదయాత్ర సాగిస్తున్న అమరావతి రైతులు



పేదలకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్న ప్రతినిధులు

పౌష్టికాహారంతో రోగాల నుంచి విముక్తి

చీరాలటౌన్, జూన్ 27 : రోగాల బారిన పడిన వారు పౌష్టికాహారంతో విముక్తి పొందవచ్చని మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి, జిల్లా డీపీఎం బాషా అన్నారు. ఆశా రేఖ మహిళా మండలిలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు సుధ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక స్థైర్యంతో ముందుకు సాగితే జీవితాలు సంతోషంగా సాగుతాయన్నారు. దాతలు సుధ మాట్లాడుతూ ప ర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు అన్ని ప్రాంతా ల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ పీడీ శ్రీనివాసరెడ్డి, సీబీవో అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


సభ్యత్వాలను నమోదు చేస్తున్న సంఘ నేతలు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

పంగులూరు, జూన్ 27 : విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఏపీటీఎఫ్ సంస్థలో ప్రతి ఉపాధ్యాయుడు సభ్యులుగా చేరాలని సంఘ జిల్లా ప్రతినిధులు కంకణాల శ్రీనివాసరావు, చేజర్ల చెంచురామారావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, అలవలపాడు, రేణంగివరం, జేవీపాలెం, ముప్పవరం పరిసర గ్రామాలలో గురువారం ఏపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తన్నీరు వెంకటరావు, రహంతుల్లా, సంఘ ప్రతినిధులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

అన్నంబొట్లవారిపాలెంలో చోరీ

అన్నంబొట్లంవారిపాలెం (పర్చూరు), జూన్ 27 : పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మర్రి జానకి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని అమెరికాలో ఉంటున్న తన కుమారుని వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న రూ.20 వేల నగదు, 2 శవర్ల బంగారు అభరణాలు, 3 కేజీలకు పైగా వెండి వస్తువులను దొంగిలించారు. జానకి అమెరికా వెళుతూ పనిమనిషికి ఇంటి బయట ప్రాంగణాన్ని శుభ్రపరిచే విధంగా బాధ్యత అప్పగించింది. రోజు మాదిరిగానే బుధవారం శుభ్రపరిచేందుకు వచ్చిన తరుణంలో ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించిన పని మనిషి స్థానికంగా ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువులు ఫోన్ ద్వారా అమెరికాలో ఉన్న జానకికి సమాచారం ఇచ్చారు. పర్చూరు ఎస్ఐ ఎస్.రమేష్ తన సిబ్బందితో, సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం ఇంట్లో నమూనాలను సేకరించారు. దీనిపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

ఎడ్‌సెట్ ఫలితాల్లో శ్వేత ప్రతిభ

» రాష్ట్రస్థాయిలో సోషల్ విభాగంలో ఫస్ట్‌ర్యాంక్

» అభినందించిన మంత్రి రవికుమార్

మేదరమెట్ల, జూన్ 27: బీఈడీ, బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష ఫలితాల్లో కొప్పుల శ్వేత సాంఘిక శాస్త్రంలో స్టేట్ ఫస్ట్ వచ్చారు. గురువారం విడుదలైన పరీక్ష ఫలితాలలో కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన శ్వేత అద్భుతమైన ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్వేతకు అభినందనలు తెలియజేశారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని నేటి యువత చదువుల్లో రాణించి పుట్టిన ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. మహిళలు విద్యలో రాణించడం వలన కుటుంబానికే కాక రాష్ట్రానికి, దేశానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.



యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, జూన్ 27: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిం చాలని ఏడీఏ కె .బాలాజీనాయక్ సూచించారు. గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించే విషయంలో రైతు లు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి మెరుగైన పద్ధతులను అవలంబిం చేందుకు అవసరమైన సూచనలు అందించాలని అధికారులను కోరారు. వ్య వసాయ శాఖ అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏశైలజారాణి మా ట్లాడుతూ పంటల సాగులో జీవన ఎరువులు, కేంద్ర ఎరువుల ద్వారా నాణ్య మైన దిగుబడులు సాధించాలని సూచించారు. ఈసందర్భంగా రైతులకు యా జమాన్య పద్ధతులు వివరించే కరదీపికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్శి ఏవో బాలకృష్ణనాయక్, జిల్లా వనరుల అధికారి వెంకటశేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజీ పూర్తిపై మళ్లీ ఆశలు



బేస్‌మట్టం వేసి ఉన్న కోల్డ్‌స్టోరేజ్

- కక్షగట్టి పాడుపెట్టిన వైసీపీ సర్కార్
- పిల్లర్ల దశలో అర్ధాంతరంగా పనులు
- పూర్తి చేయాలని కోరతున్న రైతులు

మార్కాపురం రూరల్, జూన్ 27: పశ్చిమ ప్రాంత రైతులకు ఉపయుక్తంగా ఉండేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణ పనులు నేటికీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గత వైసీపీ హయాంలో ఐదేళ్లలో ఈ కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణంపై పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. రైతాంగానికి అక్కరకు వస్తుందన్న ఆలోచన కూడా లేకుండా నిధులు నిలిపివేయడంతో నేటికీ ఆ నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రస్తుతం మరోసారి టీడీపీ అధికారంలోకి రావడంతో దీని నిర్మాణం పూర్తి చేయడంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పట్టణంలో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం కోసం మార్కెట్ యార్డులో స్థలాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం సిద్ధం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి హోదాలో నారా లోకేష్ దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా 2018 నవంబరు 28న మార్కెట్ యార్డులో రూ.5కోట్లు మంజూరు చేసి కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో స్టోరేజ్ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా దీని నిర్మాణాన్ని నిలిపివేసింది. 2019 నాటికి పిల్లర్లు దశలో కొంతభాగం స్లాబ్ దశలో మరికొంత భాగం ఉంది. ఈ ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో కొంత మేర పిల్లర్ల చువ్వలు తప్పు పట్టాయి. దీనిపైనే నిర్మాణం పూర్తి చేస్తే ఏ మేరకు నాణ్యంగా ఉంటుందనేది ఇంజనీరింగ్ అధికారులు తేల్చాలి ఉంది. నిర్మాణంలో ఉన్న స్థలాన్ని కూడా ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చి



మొక్కలు దట్టంగా పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టి నిర్మాణాన్ని పూర్తి చేయాలని రైతులు కోరతుఉన్నారు. వైసీపీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకపోతే పశ్చిమ ప్రాంత రైతన్నలకు ఉపయోగకరంగా ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం మరోసారి నిర్మాణంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

గేదెల అపహరణ

గిద్దలూరు, జూన్ 27 : మండలంలోని కొంగళవీడు బీసీ కాలనీకి చెందిన పలువురు రైతుల గేదెలు కనిపించకుండా పోయాయి. బీసీ కాలనీకి చెందిన 8 మంది పేద రైతులు తమ గేదెలను మేపుకునేందుకు సోమవారం బీడు భూముల్లోకి పంపారు. ప్రతిరోజు ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే గేదెలు రాత్రికి తిరిగి రాకపోవడంతో రెండు రోజులపాటు తెలిసిన చోటల్లా వెతికారు. కనిపించకపోవడంతో గేదెలను ఎవరైనా అపహరించి ఉంటారని భావిస్తూ ఆమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పందనబోయిన ఆవులమ్మ, బాలరాజు, రాజభూపాల్, సుబ్బలక్ష్మమ్మ, రమాదేవి, కొత్తకోట రాజకృష్ణ, పెద్దయ్య, వీరనారాయణలకు చెందిన 16 గేదెలు కనిపించడం లేదు. దీంతో ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల మీద ఆధారపడి జీవించే తమకు ఆ గేదెలే ఆధారమని పేర్కొంటున్నారు.

ఎంఆర్‌పీఎస్ కవాతును జయప్రదం చేయండి

పొదిలి, జూన్ 27 : జులై 7వ తేదీన వరంగల్‌లో నిర్వహించే ఎంఆర్‌పీఎస్ కవాతును జయప్రదం చేయాలని ఆ సంఘం మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పందింటి కాశీరావు మాదిగ కోరారు. గురువారం పొదిలిలో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు లక్ష మందితో నిర్వహించే ఆత్మగౌరవ కవాతులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉదయ్ మాదిగ, శ్యామ్ మాదిగ, రవి మాదిగ, నాగులు మాదిగ, రవీంద్ర మాదిగలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం, జూన్ 27: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం మేరకు.., మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన కాల్వ పెద్దనాగార్జున బతుకుదెరవు కోసం సంవత్సరం క్రితం కుటుంబంతో పట్టణానికి వచ్చాడు. స్థానిక పదోవార్డులోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. వాటిని తాళలేక ఇంట్లో ఎవరూలేని సమయం చూసి ఈ నెల 26వ తేదీన బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు పెద్దనాగార్జునను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున పెద్దనాగార్జున మృతి చెందారు. ఈ మేరకు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కష్టాలు తీర్చరూ...!

- పలు కాలనీ వాసుల వినతులు



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

పెద్ద దోర్నాల, జూన్ 27: దోర్నాలలో నీటికష్టాలు తీర్చాలంటూ పలు కాలనీ వాసులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. దోర్నాలకు చెందిన పీర్లచావిడి వీధి, కుమ్మరి వీధి, నాయిబ్రాహ్మణ వీధికి చెందిన మహిళలు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని నీళ్లు ఒకరోజు వస్తే మరొక రోజు రావడం లేదని నిరసన తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు స్పందిస్తూ కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగిందని, వెంటనే ట్యాంకరు పంపిస్తామని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఎస్‌వీకేపీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలి : ఎస్‌ఎఫ్‌ఐ



ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్ టౌన్, జూన్ 27: పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి నూతన అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ.. 1964నుంచి ఎయిడెడ్ కళాశా లగా కొనసాగుతున్న ఎస్‌వీకేపీ కళాశాలలో నేటికి పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోందన్నారు. మార్కాపురం డివిజన్ లోని విద్యార్థులు ఈ కళాశాలలో అతితక్కువ ఫీజులతో చదువుకునేవారన్నారు. 2019-20 విద్యా సంవత్సరం వరకు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారని, అప్పటి నుంచి కళాశాల యాజమాన్యం అడ్మిషన్‌లకు నిరాకరిస్తోందన్నారు. వెంటనే 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలో ఇంటర్, డిగ్రీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

గర్భిణీకి రక్తదానం

ఎర్రగొండపాలెం, జూన్ 27 : ఎర్రగొండపాలెంలో రవీంద్ర వైద్యశాలలో పురిటినొప్పులతో బాధపడుతున్న రామసముద్ర ం గ్రామానికి చెందిన జనుకూటి కుమారి అనే మహిళకు గురువారం ముస్లిం యూత్ సొసైటి సభ్యులు షేక్ మీరావలి రక్తదానం చేశారు. సకాలంలో రక్తం అందించిన మీరావలిని పలువురు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, జూన్ 27 : రాచర్లలోని ఏబీఎం పాలేనికి చెందిన విశ్రాంతమ్మ అనే పేద మహిళ అనారోగ్యంతో మృతిచెందగా అంత్యక్రియల ఖర్చు నిమిత్తం జనసేన నాయకులు అలిశెట్టి వెంకటేశ్వర్లు, చిన్న, నాయుడు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ప్రభాస్ ఫ్యాన్స్ సందడి

గిద్దలూరు, జూన్ 27 : సినీహీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమా విడుదల సందర్భంగా ప్రభాస్‌ఫ్యాన్స్ సందడి చేశారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో కల్కి సినిమా విడుదల కాగా ప్రభాస్ ఫ్యాన్స్ ఉదయం 7 గంటలకే బెనిఫిట్ షోకు భారీ ఎత్తున తరలిరావడమే కాకుండా డప్పులు, మేళాలు వాయిస్తూ ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలు చల్లి సందడి చేశారు.

వెలిగొండ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలి

ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్

ఎర్రగొండపాలెం, జూన్ 27 : పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించే పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణపు పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం ఎర్రగొండపాలెం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు టీసీహెచ్ చెన్నయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతు సంఘనాయకులు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం గౌరవాధ్యక్షులు చెన్నయ్య మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రారంభమై 20 సం దాటినా ప్రభుత్వాలు పనులు పూర్తి చేసి రైతులకు నీటిని విడుదల చేయక పోవడం బాధాకరమన్నారు. రైతుకు రాష్ట్రం ప్రభుత్వం అంది స్తానన్న 20వేల ఆర్థిక సహాయం ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలన్నారు. అడవి జంతువుల దాడిలో గాయపడి మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.15 లక్షలు ఆర్థిక సహాయం, గాయపడిన వారికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. గత సంవత్సరం కరువుతో ఈప్రాంత రైతులు నష్టపోయారని ఈ ఖరీఫ్ సీజన్‌లో 90శాతం రాయితీతో విత్తనాలు రైతులకు



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కేవీ.కృష్ణ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు మన్నె సాంబశివరావు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం అలవర్చుకోవాలి

పెద్ద దోర్నాల, జూన్ 27 : గురువులను గౌరవించడం ద్వారానే సమాజంలో గౌరవించబడతారని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి పరిధిలోని మోట్ల మల్లికార్జునపురంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔన్నత్యాన్ని పొందాలంటే విద్య అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఆ క్రమంలో ఎస్సీల చిన్నారుల కోసం కాలనీల్లోనే డీపెప్ పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయ నియామకాలు అత్యధిక స్థాయిలో జరిపిన ఘనత నారా చంద్రబాబు నాయుడిదేనన్నారు. గత ప్రభుత్వంలో నాడు నేడంటూ పాఠశాలలకు రంగులు మార్చడం,



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఉన్న పాఠశాలలను మూత వేయడం తప్ప విద్యార్థులకు ఒరిగిందేమి లేదన్నారు. రానున్న రోజుల్లో పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించి, సరిపడ ఉపాధ్యాయుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ పేద విద్యార్థులు సద్వినియోగపర్చుకుని ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌నాయక్, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, వసంత, బీఎం కళాశాలల ఛైర్మన్ బట్టు రమణారెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, కే సుబ్బారెడ్డి, కే రాజేంద్ర, షేక్ మంజూర్ భాష, షేక్ ఇస్మాయిల్, షేక్ భాష, బట్టు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వాహకులకు అనుమతులు తప్పనిసరి

కొమరోలు, జూన్ 27: మండలంలోని తాటిచర్ల మోటు, పాములపల్లి గ్రామాల్లోని నర్సరీలు విధిగా ఉద్యానశాఖ వద్ద అనుమతి తీసుకోవాలని గిద్దలూరు ఉద్యానశాఖ అధికారిణి విష్ణుప్రియ తెలిపారు. మండలంలోని తాటిచర్ల మోటులోని నర్సరీలను విష్ణుప్రియ గురువారం తనిఖీలు నిర్వహించి వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం విష్ణుప్రియ మాట్లాడుతూ నర్సరీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు తప్పనిసరిగా ఉద్యానశాఖ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలన్నారు. రైతులు ఈ సీజన్‌లో సాగుచేసే మిరప, టమోట, ఉల్లి తదితర నారు పెంచేందుకు నాణ్యమైన మంచి రకం విత్తనాలను వాడాలన్నారు, వాటిని సక్రమైన పద్దతిలో పెంచి రైతులకు అంద జే య ా ల న్నా ర ు. నర్సరీల్లో వాడే విత్తనాల కంపెనీ వివరాలను కూడా తెలిపే బోర్డులను ఉంచాలన్నారు. చీడ పురుగులు మరియు తెగుళ్ల రాకుండా నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాల్సిన బ ా . ధ ్ య త నర్సరీలదేన్ననారు. రైతులకు తప్పని సరిగా



నర్సరీలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ

మొక్కలు అమ్మినప్పుడు రశీదును కచ్చితంగా ఇవ్వాలన్నారు.

చుక్కల్లో కూరగాయల ధరలు

- ధరలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- కొనేందుకు వెనుకాడుతున్న వైనం



పొదిలి, జూన్ 27 : డీజిల్, పెట్రోల్ తరహాలోనే నిత్యవసర వస్తువులు ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. అదేవిధంగా ఏ కూరగాయల చూసినా ధరలు సామాన్యుడికి అందని ద్రాక్షాల మారి చుక్కలు చూపెడుతున్నాయి. రోహిణి కార్తె వరకు ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తే ఇప్పుడు అదేవేడిని కూరగాయల ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ఏడాది ఎండల ప్రభావం కూరగాయలసాగుపై పడడంతో పంటలు తగ్గి వినియోగదారుడికి కొందామంటే కొరివి తిందామంటే అడివిలా ఉందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతల దాటికి బోర్లలో నీరు తగ్గిపోయి కూరగాయల దిగుబడి తక్కువగా వచ్చిందని అందువల్లనే అరకొరగా వచ్చే ఆకుకూరలు, కూరగాయలతో ధరలు పెరిగిపోయాయని వ్యాపారు లు అంటున్నారు. గత నెలరోజులుగా కూరగాయలైనా 100 రూపాయలకు పెరిగిపోవడంతో ప్రజలు దిక్కతోచని స్థితిలో ఉన్నారు. కాకర రూ.100, పచ్చిమిర్చి కిలో రూ.80, టమోట రూ.80, బీర రూ.80, క్యారెట్, బీట్రూట్ రూ.80, బెండ, దొండ రూ.60, అల్లం రూ.150 ఉండగా మునగ కిలో రూ.180, చొప్పున ధరలు పలుకుతున్నాయి. దీంతో వినియోగదారుడు ఏమిచేయాలో అర్థంకాక గతంలో కిలో కొన్న కూరగాయలు ఇప్పుడు పావుకిలో చాలు అనే స్థితికి వచ్చాడు. అంతే కాకుండా చికెన్, కోడిగుడ్ల ధరలు కూడా తారాంతం పెరిగిపోయాయని వినియోగదారులు వాపోతున్నారు. ఈవిధంగా మంచి ఆహారం తినాలనే ఆలోచన మర్చిపోవాల్సి పరిస్థితి వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలతో సామాన్యు కొని తినలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

వసతిగృహ విద్యార్థినుల నడక యాతన

- పాఠశాలకు రెండు కిలోమీటర్ల నడక
- జాతీయ రహదారి వెంబడే ప్రయాణం

కంభం, జూన్ 27 : కందులాపురం పంచాయతీ పరిధిలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులు నిత్యం 2 కిలోమీటర్ల దూరంలో ఉండే జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు నడిచి వెళ్లి తిరిగి వస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే కంభం మండలం కందులాపురం పంచాయతీలోని రైల్వేస్టేషన్ సమీపంలో 3 నుంచి 10వ తరగతి వరకు బీసీ బాలికల వసతిగృహం ఉంది. ఈ హాస్టల్‌లో దాదాపు 100 మంది పైగా విద్యార్థినులు ఉన్నారు. వీరిలో 20 మంది సమీపంలోని పాఠశాలకు వెళుతుండగా మిలిగిన 80 మంది విద్యార్థినులు దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు వచ్చిపోతున్నారు. వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటూ తరచూ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారిన విజయవాడ-కడప హైవే దారి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మీదుగా బాలికోన్నత పాఠశాలకు వెళ్లి రావాల్సి ఉంది. నాలుగేళ్ల క్రితం ఈ మార్గం హైవేగా మారడంతో ట్రాఫిక్ పెరగడంతోపాటు ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఇక ఎండాకాలం ఒంటిపూట బడులు నిర్వహించే సమయంలో మండుటెండలో నడక సాగిస్తూ వసతిగృహానికి చేరుకోవాల్సివస్తోంది. వర్షాకాలంలో కూడా ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడినా తడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లి రావలసిందే. విద్యార్థినులకు బాలికోన్నత పాఠశాల సమీపంలోనే అన్ని వసతులు ఉన్న వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తగ్గుతాయని పలువురు కోరుతున్నారు. పైగా క్రమశిక్షణగా రోడ్డు పక్కన విద్యార్థినులు వెళుతుండగా, ద్విచక్ర వాహన దారులు మితిమీరిన వేగంతో వెళుతుంటారు. కావున విద్యార్థినుల అవస్థలను గుర్తించి సౌకర్యాలు ఉండే భవనానికి మార్చాల్సిందిగా తల్లిదండ్రులు కోరుతున్నారు.



రోడ్డు దాటుతున్న విద్యార్థులు

వివరణ

ఈ విషయంపై అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ జబ్బార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాము కూడా విద్యార్థినుల అవస్థలు గమనిస్తున్నామన్నారు. అందుకే హైస్కూలుకు దగ్గరలో అన్ని సౌకర్యాలు ఉండే వసతిగృహం కోసం వెతుకుతున్నట్లు తెలిపారు.

అవీ..ఇవీ..

కంభం నూతన ఎంపీడీవోగా అరుణదేవి



బాధ్యతలు స్వీకరించిన అరుణదేవి

కంభం, జూన్ 27 : కంభం మండల నూతన ఎంపీడీవోగా కె.అరుణదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాచర్లలో ఎంపీడీవోగా పని చేస్తున్న అరుణదేవి ఆరోగ్యరీత్యా కొంత కాలం సెలవులపై ఉన్నారు. గురువారం ఆమెను కంభం మండల ఎంపీడీవోగా బదిలీ చేయడంతో గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉన్న మస్తాన్‌వలి ఈవోఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించారు.

వేంకటేశ్వరునికి ఊంజల్ సేవ



విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

మార్కాపురం వన్ టౌన్, జూన్ 27: పట్టణంలోని శివాజీ నగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్వామివారికి ఉంజల్‌సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరుని మూలవిరాట్‌ను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఊంజల్‌సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. వివిధ కోళాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామికి గురువారం రాత్రి నగరోత్సవం నిర్వహించారు.

భూసార పరీక్షలతో తగ్గనున్న పెట్టుబడి



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బేస్తవారపేట, జూన్27: రైతులు పొలాల్లో క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షల ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చునని వ్యవసాయాధికారి జక్కం మేర్సీ అన్నారు. గురువారం బేస్తవారపేట మండలంలోని బసినేపల్లె రైతుభరోసా కేంద్రంపరిధిలో మట్టినమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మట్టినమూనాలపై అవగాహన పొందాలని ప్రతి రైతు మట్టి నమూనాలు సిబ్బంది ద్వారా సేకరించి పరీక్షలకు పంపితే వాటి ఆధారంగా తగిన ఎరువులు, మందులు వినియోగించు కోవచ్చన్నారు. తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అన్నారు. మండలంలో 662 మంది రైతులు నుండి మట్టి నమూనాలు సేకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

సాయినామ సంకీర్తన ప్రారంభం



సాయినామ సంకీర్తన చేస్తున్న భక్తులు

మార్కాపురం వన్ టౌన్, జూన్ 27: గురుపౌర్ణమిని పురస్కరించుకొని నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి మందిరంలో 24గంటల పాటు నిర్వహించే సాయి నామ సంకీర్తన గురువారం ప్రారంభించారు. ఉదయం సాయినాథునికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కార్యదర్శి హరిహరరావు మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి భక్తుల గృహాలలో ఉదయం 6 గంటలకు కాగడ హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 28న బాబా జీవిత చరిత్రపై క్విజ్, 29న భక్తి గీతాల పోటీ, 30న సాయిభిక్ష, జూలై 4నుంచి వారంరోజుల పాటు ప్రముఖల ప్రవచనలు, 11 నుంచి వారం రోజులు పారాయణాలు, 21న గురుపౌర్ణమి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగారాజు, నాగగోపి, పవన్, కరీమ్, కృష్ణమోహన్, నాగేశ్వరరావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

గిద్దలూరు, జూన్ 27 : మండలంలోని నరవ గ్రామంలోని సత్యసాయి మందిరంలో సత్యసాయివ్రతం వైభవంగా నిర్వహించారు. సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్య సాయి సేవాసమితి ప్రతినిధులు బాలక్రిష్ణారెడ్డి, నారాయణరావు, అనంతరామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి



స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న కందుల రామిరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 27: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తు పొందాలని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్స్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్ళి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూలు బ్యాగ్‌లు పంపిణీ

ఎర్రగొండపాలెం : మండలంలోని బోయలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా టీడీపీ తెలుగుయువత ఉపాధ్యక్షులు పాలడుగు వెంకటకోటయ్య ప్రభుత్వం నుంచి వచ్చిన స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాలడుగు వెంకటేశ్వర్లు, మండల రైతు అధ్యక్షులు పోకా వెంకట సుబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పంటసాయం అందించాలి

బేస్తవారపేట,జూన్27:రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ బి.పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు సాగు సాయం ఈ ఖరీఫ్ సీజన్‌లో అందించాలన్నారు. పంట రుణాలు రూ.3లక్షల వరకు వడ్డి లేకుండా, రూ5లక్షల వరకు పావాల వడ్డితో ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు జె.అంకయ్య, సీపీఐ కార్యదర్శి జోసఫ్, రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు కరదీపికలను అందజేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

దర్శి, జూన్ 27: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ కె.బాలాజీనాయక్ సూచించారు. గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడులు సాధించే విషయంలో రైతులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి మెరుగైన పద్ధతులను అవలంబించేందుకు అవసరమైన సూచనలు అందించాలని అధికారులను కోరారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏశైలజారాణి మాట్లాడుతూ పంటల సాగులో జీవన ఎరువులు, కేంద్ర ఎరువుల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. ఈసందర్భంగా రైతులకు యాజమాన్య పద్ధతులు వివరించే కరదీపికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్శి ఏవో బాలకృష్ణనాయక్, జిల్లా వనరుల అధికారి వెంకటశేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

దర్శి, జూన్ 27: రాష్ట్ర బీజేపీ ఆదేశాల మేరకు అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆపార్టీ నాయకులు దర్శి పట్టణంలోని బాలికల బీసీ హాస్టల్‌లో మొక్కలు నాటారు. ఈసందర్భంగా పార్టీ దర్శి నియోజకవర్గ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ పెంపొందించేందుకు మొక్కలు నాటి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వృక్ష సంపద తగ్గిపోవటంతో ఉష్ణోగ్రతలు, కాలుష్యం విపరీతంగా పెరిగి ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.నారాయణ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అచ్చుత గురువార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ఆగిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఈ రమేష్‌బాబు

పామూరు, జూన్ 27: పామూరు మండలంలోని తూర్పుకట్టకిందపల్లి పంచాయతీ పరిధిలో నిలిచిన కరోళ్లపాడు గ్రామ రోడ్డు పనులను పీఐయూ ఏఈ రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 0.93 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ఈఏపీ గ్రాంట్ కింద రూ.కోటి 12 లక్షల 89వేల నిధులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వి రెండు కల్వర్టులు మాత్రమే నిర్మించారు. వాటిపై స్లాబు వేయకుండా రోడ్డు పనులను నిలిపివేశారు. ఈనేపథ్యంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ నాయకుడు పాలపర్తి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే ఉగ్ర దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో ఏఈ రమేష్‌బాబు గురువారం కరోళ్లపాడు గ్రామానికి విచ్చేసి అర్థంతరంగా నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి గ్రామస్థులకు రహదారి కష్టాలు తీరుస్తామని ఏఈ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాయచెరువు, పిల్లి పల్లి, చినకోటాలపల్లి, బోయమడుగుల, బోడావులదిన్నె పాఠశాలలను గురు వారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని బడిఈడు పిల్లలు పాఠశాలల్లో చేరే విధంగా చూడాలని సూచించారు. చినకోటాలపల్లి నుంచి మండల కేంద్రం లోగల ప్రయివేట్ పాఠశాలలకు విద్యార్థులు వెళుతున్నారు. వీరిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా ఉండేలా చూడాలని ఏజన్సీలకు సూచించారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆన్‌లైన్ యాప్‌లోనే హాజరు నమోదు చేయాలన్నారు.

కాగా, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న విద్యాకిట్లను ఎంఈవో రాజాల కొండారెడ్డి ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాదరున్నీసాబేగం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

బలిజసేన మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి



కాల్వ లక్ష్మి

కురిచేడు, జూన్ 27: రాష్ట్ర కాపు, బలిజ, తెలగ, ఒంటరి సంక్షేమ సంఘానికి కురిచేడు మండల అధ్యక్షురాలిగా జనసేన వీర మహిళ కాల్వ లక్ష్మికుమారిని నియమించారు. అందుకు సంబంధించి నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అందజేశారు. మండలంలో కాపు సంఘం తరపున ఎవరికైనా సమస్యలు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని లక్ష్మి తెలిపారు. తనను నియమించిన కృష్ణప్రసాద్‌కు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

కురిచేడు, జూన్ 27: కురిచేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో సీతారామయ్య తెలిపారు. శుక్రవారం జరగాల్సిన ఈ సమావేశాన్ని వాయిదావేసిన విషయం ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు.

రూ.75 కోట్లతో అభివృద్ధి పనులు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 27: కనిగిరి నియోజకవర్గంలో రూ.75 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణం స్వీకారం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనిగిరిలో పదేళ్ళుగా అభివృద్ధి శూన్యమన్నారు. ట్రిపుల్‌ఐటీ పరాయి ప్రాంతానికి వెళ్ళిపోయిందన్నారు. ఈఏడాది కనిగిరి ప్రాంతంలో ప్రారంభం కావాల్సి ఉండగా, సరైన భవనంలేక తెచ్చుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అతి త్వరలో తగిన భవనంలో ట్రిపుల్‌ఐటీ ప్రారంభించి తీరుతామన్నారు. కనిగిరిలో సమ్మర్‌స్టోరేజి ట్యాంకుతో పాటు ఇంటింటికి కుళాయి ఏర్పాటుచేపడతున్నట్లు చెప్పారు. అందుకోసం నిలిచిపోయిన పనులను తిరిగి చేపట్టనున్నట్లు చెప్పారు.

కనిగిరిలో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డివిజన్ స్థాయి ప్రభుత్వశాఖల కార్యాలయాలు ఏర్పాటు కావాలంటే పది ఎకరాల స్థలం అవసరమన్నారు. కనిగిరికి కూతవేటు దూరంలో ఉండే స్థలాన్ని చూడాలని కమిషనర్‌కు సూచించారు. నాగులచెరువు ప్రాంతంలో అక్రమ వెంచర్లు తొలగించాలన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో వేసిన వెంచర్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అక్రమ వెంచర్లలో ఎవరైనా ప్లాట్లు కొని ఉంటే వారు ఇచ్చిన డబ్బును తిరిగి తీసుకోవాలన్నారు. డబ్బులు ఇవ్వకపోతే సదరు రియల్టర్‌పై కేసు పెట్టాలన్నారు. అనధికార లేఅవుట్లను గుర్తించి ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన పాలన అందించటమే తమ లక్ష్యమని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. అందుకు పార్టీలకతీతంగా సహకారాన్ని అందించాలని కోరారు. కనిగిరి ప్రాంతాభివృద్ధిలో తనదైన ముద్ర వేసిన తిరుపతినాయుడు, పులి వెంకటరెడ్డి లాంటి నాయకులను ఇప్పటికీ ప్రతి రోజూ స్మరించుకుంటున్నారంటే వారు చేసిన పాలనే అని అన్నారు. తన పిల్లల కోసమో, తన కోసమో తాను తపన పడటం లేదన్నారు. మనప్రాంతంపై మక్కువతోనే తాను రాజకీయంగా కొనసాగుతున్నానని చెప్పారు. ఇప్పటికీ మన ప్రాంతంలోని 2.40లక్షల ఓటర్లలో 64 వేల మంది పరాయి ప్రాంతాల్లో జీవిస్తున్నారన్నారు. నిమ్జ్ ఏర్పాటు జరిగితే 5లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కూడా కౌన్సిల్ హాలు రూపురేఖలు మార్చి కొత్త హంగులతో తయారుచేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. మోడల్‌స్కూలుకు రోడ్డు ఏర్పాటుకు అత్యవసర నిధుల నుంచి రూ.కోటితో తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ టీవీ రంగారావు, మేనేజర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దర్శికి తరలిన ఐసీడీఎస్ కార్యాలయం

» ముందుచూపు లేకుండా వైసీపీ పాలకుల నిర్వాకం

» ఇబ్బందులు పడుతున్న తాళ్లూరు, ముండ్లమూరు మండలాల అంగన్‌వాడీలు



తాళ్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయం

తాళ్లూరు, జూన్ 27 : తాళ్లూరులో 21 ఏళ్లుగా కొనసాగుతున్న సమగ్ర శిశు అభివృద్ధి(ఐసీడీఎస్) కార్యాలయాన్ని గత వైసీపీ పాలకులు స్వార్థ రాజకీయాలతో ముందుచూపు లేకుండా దర్శికి మార్చారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరులో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఐసీడీఎస్ కార్యాలయం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం దర్శిలో ఏర్పాటుచేసిన ఐసీడీఎస్ ప్రాజెక్టు అతిపెద్ద ప్రాజక్టుగా ఉంది. తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు దర్శికి వెళ్లేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. పూర్వపు సమితి కేంద్రమైన తాళ్లూరులో 2002లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయించారు. తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రధాన కార్యాలయంగా ఉంది. 2009లో ఐసీడీఎస్ కార్యాలయానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల కాంప్లెక్స్ సముదాయంలో శాశ్వత భవనం నిర్మించారు. రెండు దశాబ్దాలపాటు కార్యాకలాపాలను నిర్వహించిన ఐసీడీఎస్ కార్యాలయాన్ని వైసీపీ ప్రభుత్వ పాలనలో గతేడాది నియోజకవర్గ కేంద్రమైన దర్శికి మార్చారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను ఈ పరిధిలోకి చేర్చారు. దర్శికి ఐసీడీఎస్ కార్యాలయాన్ని మార్చడంవల్ల తాళ్లూరు, ముండ్లమూరు ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

తాళ్లూరు మండలంలో 54 అంగన్‌వాడీ కేంద్రాలు, ముండ్లమూరు మండలంలో 74 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. దర్శి ప్రాజెక్టు కార్యాలయం జిల్లాలోనే అతి పెద్ద ఐసీడీఎస్ ప్రాజెక్టుగా కొనసాగుతున్నది. ఐసీడీఎస్ కార్యాలయం దర్శికి మారుస్తున్నట్లు తెలిసినా గత వైసీపీ చెందిన ప్రజాప్రతినిధులు తమకేమి పట్టనట్టు మిన్నకున్నారు. దర్శి ప్రాజెక్టులో దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలను కొనసాగించి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలను గతంలో మాదిరిగా తాళ్లూరులో కొనసాగించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నాయి.

గతంలో నిత్యం అధికారులు, అంగన్‌వాడీ వర్కర్ల రాకపోకలతో కళకళలాడిన ఐసీడీఎస్ కార్యాలయం ప్రస్తుతం నిర్మానుష్యంగా వుంది. కార్యాలయ తాళాలు ఏదో మొక్కుబడిగా మాత్రమే తెరుచుకుంటున్నాయి. సిబ్బంది అంతా దర్శికి వెళ్లిపోవటంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన శాశ్వత భవనం నిరుపయోగంగా ఉంది. అతిపెద్ద ప్రాజెక్టుగా ఉన్న దర్శి నుంచి తాళ్లూరు, ముండ్లమూరు మండలాలను విడదీసి తాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని తిరిగి పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

అడుగు ముందుకుపడని సబ్‌స్టేషన్ పనులు

» నాలుగేళ్ల క్రితం ఆర్భాటంగా శంకుస్థాపన

» పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» తొలగని రైతుల కష్టాలు



శంకుస్థాపన చేసిన శిలాఫలకం



నిర్మాణ పనుల కోసం తీసిన గుంతలు

తాళ్లూరు, జూన్ 27: వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రం పనులు అటకెక్కాయి. నాలుగేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ చేతులు మీదుగా పనులు చేపట్టేందుకు శంకుస్థాపన జరిగిందే తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదు. వైసీపీ పాలకులు ఆరంభ శూరత్వమే తప్పసంపూర్ణంగా పూర్తిచేసిన పని ఒక్కటి లేదు. వైసీపీ ప్రభుత్వం రైతాంగప్రభుత్వం అంటూ ఐదేళ్లక్రితం అగమేఘాల మీద 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి నిధులు మంజూరయ్యాయంటూ నిర్మాణ పనులకు అప్పటి ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా 2020 జనవరిలో రూ22.7 కోట్ల నిధులతో శిలాఫలకం వేశారు. నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించి 60 గ్రామాలకు చెందిన విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా జరుగుతుందని ఆరోజు ప్రకటించారు. వైసీపీ నాయకులు రైతాంగాన్ని ఊరించి పనులు మాత్రం చేపట్టలేదు. విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శివరాంపురం గ్రామ శివారునగల తూర్పుగంగవరం-చీమకుర్తి వెళ్లేమార్గంలో నాలుగుఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి శంకుస్థాపన చేశారు.



నిరుపయోగంగా విద్యుత్ సామగ్రి

విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణప్రాంతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి మట్టిని తోలి చదును చేశారు. నేడు ఆప్రాంతంలో మొక్కలు మొలిచాయి. పనుల కోసం తీసిన గుంతలు సగభాగం పూడిపోయి దర్శనమిస్తున్నాయి.

శంకుస్థాపన చేసిన తరువాత ఏడాదికి కాంట్రాక్టర్ మెటీరియల్‌ను, సామగ్రిని తోలారు. మెటీరియల్‌ను తోలిన కొత్తల్లోనే గుర్తుతెలియని వ్యక్తులు అపహరించటంతో ఓ కాపలాదారుడిని పెట్టి సామగ్రి చోరీ కాకుండా చూస్తున్నారు. ఆ కాపలాదారునికి జీతభత్యాలు చెల్లించక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉపకేంద్రంనిర్మాణం ఎప్పుడుచేస్తారో తమ సమస్యలు ఎప్పుడు తొలిగిపోతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దర్శి టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, సంబంధిత విద్యుత్ శాక అధికారులు స్పందించి 132/33 విద్యుత్ ఉపకేంద్రం పనులు ప్రారంభించి తాళ్లూరు పరిసర ప్రాంత రైతాంగ సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహిళలు రాణించాలి



మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 27: మహిళలు సాధికార దిశగా రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జననీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలలుగా 80 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. కుట్టు మిషన్‌లో మహిళలు ఎంతో రాణించినట్లు చెప్పారు. వారికి మాజీ కౌన్సిలర్ సద్గురు శ్రీలత కుట్టమిషన్లకు సహకారం అందించినందుకు ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొగ్గరపు శ్రీలత, సద్గురు, తెలుగు మహిళలు కరణం అరుణ, దొరసాని, తులసి, స్వప్న, సమీరా, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు జవాబుదారీగా పనిచేయాలి

» ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు క్రైం, జూన్ 27: పోలీసులు ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ కోరారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న తీవ్రమైన కేసులను సమీక్ష చేసి దర్యాప్తులో అవలంబించాల్సిన సూచనలను చేశారు. ఈనెల 29న జరగనున్న లోకఅదాలత్ రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు సత్వరం పరిష్కారం చేస్తూ పారదర్శకంగా పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని కోరారు. సిబ్బంది సంక్షేమం విషయంలో అధికారులు వేగవంతంగా స్పందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు యంత్రాంగం సమష్టిగా కృషిచేసిందని అభినందించారు. అంతేకాకుండా పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేసారు. ఎన్నికల విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అదనపు ఎస్పీలు కే.నాగేశ్వరరావు, ఎస్‌వీ.శ్రీధరరావు, డీఎస్పీలు రామరాజు, అశోక్‌వర్ధన్, బాలసుందరం, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖరరావు, పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు. అర్ధవీడు పోలీస్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా ఆధారాలు సేకరించిన కంభం సీఐ రామకోటయ్య ఎస్సై ఎం.అనిత, కోటయ్య, కానిస్టేబుళ్ల లక్ష్మీనాయక్, హోంగార్డు ఎమ్.నాగరాజులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అచ్చమాంబ పేరంటాలు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

పామూరు, జూన్ 27: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ కమ్మవారిపాలెం, రఘునాథపురం గ్రామాల మధ్యన వెలసియున్న శ్రీఅచ్చమాంబతల్లి పేరంటాల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం మూల మంత్ర హోమాలు, అమ్మవారికి అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన పూజలను రుత్వికులు కొల్లు రవికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగాయి.

ఈ సందర్భంగా అమ్మ వారిని ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని రెండు గ్రామాల్లో మేళతాళతో బాణ సంచా కాలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన ధర్మకర్త అడుసుమల్లి చెంచయ్య, చైర్మన్ అడుసుమల్లి నరసింహులు, నిర్వాహక కమిటీ సభ్యులు దుద్దుకూరు మల్లికార్జున, దుద్దుకూరు యోగానంద్, రావెళ్ల వెంకటరత్నం, భక్తులు పాల్గొన్నారు.

రేపటినుంచి వెంగళాయపల్లిలో ఎల్లమ్మ కొలుపులు

పీసీపల్లి, జూన్ 27: మండలంలోని వెంగళాయపల్లి గ్రామంలో ఈనెల 29 నుంచి జూలై 3 వరకు మద్దిరాల ఎల్లమ్మ కొలుపులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కొలుపులను కోటపాటి, కమ్మ ఇంటిపేరు గల వంశస్థులు నిర్వహిస్తున్నారు. 29న అమ్మవారి సముద్రస్నానం, 30న మాత తుడుపు, జూలై 1న కుమర్ల భోజనం, 2న సద్దుల కూటం, 3న పట్నాలు, సాయంత్రం దీనబండారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకోవాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు


ముండ్లమూరు, జూన్ 27: మండలంలోని మారెళ్ల చెరువులో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులకు అడ్డేలేకుండా పోయింది. ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో చెరువులో మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఈమట్టి కొందరికి కాసుల వర్షం కురిపిస్తుంది. ఇటీవల బసవాపురం చెరువులో కూడా ఈతంతు సాగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మారెళ్ల చెరువులో కొనసాగుతున్న గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

దర్శి జూన్ 27: దర్శి సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పూసల చిన్నయ్య సతీమణి సుశీల 8వ వర్ధంతి సందర్భంగా స్థానిక షిరిడి సాయిబాబా ఆశ్రమంలోని వృద్ధులకు గురువారం దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు అప్పిశెట్టి వాసు, అప్పిశెట్టి లక్ష్మి, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 27: సమయపాలన పాటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని కోఆర్డినేటర్ శ్యామూల్ అన్నారు. గురువారం జరిగిన అంగన్‌వాడీల సెక్టార్ సమావేశంలో సీడీపీవో సి.సరోజిని మాట్లాడుతూ కార్యకర్తలు బాధ్యతగా పనిచేసి అంగన్‌వాడీ కేంద్రాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవాకృపావరం, సరళ, తదితరులు పాల్గొన్నారు.



సొంతింటి.. ఆశలకు రెక్కలు



గుంటూరులోని టిడ్కో ఇళ్లు



తెనాలిలో పూర్తయిన టిడ్కో ఇళ్లు

● పెండింగులో ఫేజ్-2 పనులు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి వరకూ సాగుతున్న పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో అనేక చోట్ల ఆపేసింది. పాత టెండరుదారులను ఆపేసి తిరిగి టెండర్లు తీసుకుంది. కానీ పనులు మాత్రం ఎక్కడా ప్రారంభం కాలేదు. తెనాలి పట్టణ పరి ధిలో ఫేజ్- 2 కింద 1,008 ఇళ్ల నిర్మాణం చేపట్టగా అవి 47 శాతమే పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. రేపల్లె పరిధిలో 864 ఇళ్ల నిర్మాణం చేపట్టగా గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో 2019 నుంచి పనులే జరగలేదు. వినుకొండలో 720 ఇళ్లకు 27 శాతం పనులు పూర్తయ్యాయి. నిధులు లేకపోవడంతో అక్కడ కూడా నిర్మాణాలు నిలిచిపోయాయి. రివర్స్ టెండరింగ్ తర్వాత 60 శాతం వరకూ పనులు జరిగాయి. గుంటూరు పరిధిలోని వెంగళాయపాలెంలో 1,392 ఇళ్ల నిర్మాణం చేపట్టగా అవి 82 శాతం దగ్గర ఆగిపోయాయి. మాచర్ల పరిధిలో ఫేజ్- 2 కింద 1,056 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 58 శాతం పూర్తై, నిధుల లేమితో పనులు నిలిచిపోయాయి. పిడుగురాళ్ల పరిధిలో ఫేజ్-2 కింద 1,536 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 1,296 ఇళ్లకు రివర్స్ టెండరింగ్ ద్వారా టెండర్లు పిలిచారు. వారు 24 శాతం పనులు చేశారు. మిగిలిన పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. కొత్తగా కొలువుతీరిన కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. వాస్తవంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఆ ఇళ్ల నిర్మాణం కొత్త ప్రభుత్వానికి సవాలుగానే ఉంది. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తారన్న నమ్మకం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఆ దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తే పట్టణ పేదల సొంతింటి కల త్వరలోనే నెరవేరుతుంది. లబ్ధిదారులకు అందించిన ఇళ్లకు తక్షణం మౌలిక సదుపాయాలు కల్పిస్తే వారు సొంత ఇంటిలో అడుగుపెట్టే అవకాశం వస్తుంది.

సొంతిల్లు.. అందరి కల. అలాంటి కల సాకారం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో పేరుతో శ్రీకారం చుట్టగా.. వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. 2019లో జగన్ ముఖ్యమంత్రి కావడంతో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. 90 శాతం వరకు పూర్తి చేసుకున్న ఇళ్లకు టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు కూడా చేయించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్ టిడ్కో గృహాలకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. మరికొన్ని మున్సిపల్ కేంద్రాల్లో రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. దీంతో పూర్తిన ఇళ్లతో పాటు టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన టిడ్కో పనులను ఐదేళ్లుగా పాడుబెట్టారు. ఇళ్లు కళ్లెదుట కనిపిస్తున్నా అందులోకి వెళ్లలేక లబ్ధిదారులు అటు అద్దెలు కట్టలేక.. ఇటు టిడ్కో ఇళ్ల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడ్డారు. ప్రతిపక్షాలతో పాటు లబ్ధిదారులు ఆందోళనలు చేసినా టిడ్కో ఇళ్లపై జగన్ ప్రభుత్వం వాయిదాలతో సరిపెట్టింది. చివరకు సౌకర్యాలు కల్పించకుండా టిడ్కో ఇళ్లకు రంగులు వేసి ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ చేసింది. దీంతో లబ్ధిదారులు గృహ ప్రవేశాలతో సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో లబ్ధిదారులు సొంతింటి ఆశలకు రెక్కలొచ్చాయి. త్వరలో అరకొర మిగిలిన పనులు పూర్తి చేసి తమకు కూటమి ప్రభుత్వం ఇళ్లను అప్పగిస్తుందన్న ఆశలో పలువురు ఉన్నారు.

గుంటూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిం ది. కానీ ఈనాటి వరకూ వారి కల దాదాపు కలగానే ఉంది. గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పాడుబెట్టడమే అందుకు కారణం. తాజాగా కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడం, టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టిన చంద్రబా బు తిరిగి ముఖ్యమంత్రి కావ డంతో వారి సొంతింటి ఆశల కు మళ్లీ రెక్కలు వచ్చాయి. ఏళ్లుగా నిరీక్షిస్తున్న టిడ్కో ఇళ్లు ఇక తమకు సొంతం కాబోతున్నాయన్న ఆనందం లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందని వారంతా కోటి ఆశలతో ఎదు రు చూస్తున్నారు. కాగా ఇప్ప టికే పంపిణీ చేసిన టిడ్కో ఇళ్లలో సౌకర్యాలు లేకపోవడం తో గృహప్రవేశం చేసిన లబ్ధిదా రులు ఆ వైపు కూడా చూడడం లేదు. మౌలిక సదుపాయాలు కల్పి స్తే దాదాపు సగం ఇళ్లు ఇప్పటికిప్పుడు ఆవాసయోగ్యంగా మారుతాయి.

పాడుబెట్టిన వైసీపీ సర్కార్

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 12 పట్టణాల్లో పేదల కోసం 32,304 టిడ్కో ఇళ్లు నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చు ట్టింది. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయానికి చాలా చోట్ల ఇళ్లు పూర్తయ్యాయి. తాగునీరు, విద్యుత్, అంత ర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే చేయాల్సి ఉంది. కాగా 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. ఐదేళ్లపాటు కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా, లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం తాత్సారం చేసింది. దాదాపు 90శాతం నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మిగిలిన 10శాతం పనులు పూర్తిచేయకుండా ఐదేళ్లపాటు పాడుబెట్టింది. ఆ కారణంగా లబ్ధిదారులు నష్టపోయారు. కేటగిరీ- 2, 3 కింద ఉన్న 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు అప్పులు తెచ్చి నగదు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో వారంతా అప్పులకు వడ్డీలు, ఇళ్లకు అద్దెలు చెల్లించుకుంటూ నలిగిపోయారు. ఈ నేపథ్యంలో తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణ పేదల కళ్లల్లో సొంతింటి ఆశలు మళ్లీ కనిపిస్తున్నాయి.

● ఎన్నికలకు ముందు హడావుడి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 32,304 ఇళ్ల నిర్మాణం చేపట్టగా వాటిలో 16,296 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. 300 చ.అడుగుల ఇళ్లు 13,456కు 6,733 ఇళ్లు, 365చ.అడుగుల 11,488కు 5,715 ఇళ్లు, 430 చ.అడుగుల 7,360 ఇళ్లకు 3,848 ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించారు. గుంటూరు నగర పరిధిలో అడవి తక్కెళ్లపాడులో 4,192 ఇళ్లు, పొన్నూరు పట్టణ పరిధిలో 2,368 ఇళ్లు, తెనాలి పట్టణ పరిధిలో 848 ఇళ్లు, మంగళగిరి పరిధిలో 1,728 ఇళ్లు, సీఆర్డీఏ పరిధిలోని 8 గ్రామాల్లో 5,024 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నికల ప్రయోజనం కోసం గత ప్రభుత్వం హడావుడిగా ఇళ్లను లబ్ధిదారులకు అందజేసినా, అక్కడ మౌలిక సదుపాయాల కల్పన మాత్రం పూర్తి కాలేదు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యల కారణంగా లబ్ధిదారులు ఫ్లాట్ల వైపు చూడలేదు. రాజధాని పరిధిలోని పలు గ్రామాల్లో పదిశాతం మంది లబ్ధిదారులు కూడా ఇళ్లలో ఉండడం లేదు. గుంటూరు నగరంలో నీటి సమస్య కారణంగా లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కాగా ఇంకా 16,008 ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు దక్కలేదు. ఆ ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తు న్నారు.





తెనాలిలో టిడ్కో గృహాలలో పూర్తయిన అంతర్గత పనులు

- టీడ్కో గృహాలకు గ్రహణం వీడినట్లే
- కల నెరవేరుతుందన్న సంతోషంలో పట్టణ పేదలు
- 90 శాతం పూర్తైన ఇళ్లను పాడుబెట్టిన వైసీపీ ప్రభుత్వం
- సదుపాయాలు కల్పించకుండా ఎన్నికలకు ముందు హడావుడిగా పంపకం
- కనీస సౌకర్యాలు లేక గృహ ప్రవేశాలతో సరిపెట్టిన లబ్ధిదారులు

అక్రమాలపై... ఆరా

- వైసీపీ పాలనలో జరిగిన దోపిడీ పర్వాలపై ఆరా
- సంబంధిత విభాగాలకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు
- రికార్డుల దుమ్ము దులుపుతున్న సిబ్బంది
- నేతల దోపిడీపై గతంలోనే కొన్ని రిపోర్టులు
- వ్యవస్థలను లెక్కపెట్టకుండా వ్యవహరించిన వైసీపీ నేతల్లో వణుకు

బాపట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువుదీరింది.. ఆయా విభాగాల పనితీరు మీద దృష్టి పెట్టడమే కాకుండా గడచిన ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలపై ప్రధానంగా దృష్టిసారించి అడుగులేస్తోంది. దానిలో భాగంగా ఆయా విభాగాలకు ఇప్పటికే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో జరిగిన దోపిడీ ఇత్యాది అంశాలపై నివేదిక ఇవ్వాలని శాఖాధిపతులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నామినేటెడ్ పోస్టులన్నీ రద్దు చేసిన దృష్ట్యా వాటిలో జరిగిన అవకతవకలపై కూడా నివేదిక ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ముఖ్యంగా ఐదేళ్లలో జరిగిన రెవెన్యూ నిర్ణయాలతో పాటు గతంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వద్ద జిల్లాకు సంబంధించి అందిన ఫిర్యాదులపై ముఖ్యంగా దృష్టి పెట్టింది. గతంలో ఉన్న నివేదికలతో పాటు ప్రస్తుతం అందే వివరాలను బేరీజు వేసుకుని అక్రమార్కులపై ఏం చర్యలు తీసుకోవాలో తుది నిర్ణయానికి రానున్నారు. దీంతో అధికారం అండతో చెలరేగిపోయిన వైసీపీ నేతాగణం వెన్నులో వణుకు మొదలవడమే కాకుండా వారితో అంటకాగిన ఉద్యోగులలో కూడా ఆందోళన మొదలైంది. పాత రికార్డుల దుమ్ము దులిపే పనిలో సిబ్బంది నిమగ్నమయి ఉన్నారు.



యంత్రాంగం కదిలింది...

సహకార సొసైటీల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేసే దిశగా సిబ్బంది అడుగులేస్తోంది. బాపట్లలో ఉన్న ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతమైన సంగతి తెలిసిందే. దానికి సంబంధించి సంస్థకు ఉన్న మొత్తం ఆస్తుల వివరాలతో పాటు కొలతలు వేసి మరీ వాటి వివరాలను పంపాలని ఆదేశించినట్లు సమాచారం. దానిలో భాగంగా బుధవారమే సదరు సిబ్బంది కొలతలు వేసే పనిని చేపట్టారు. జిల్లాలో అటవీ భూములతో పాటు అసైన్డ్ భూముల విషయంలో పెద్ద ఎత్తున గతంలో ఆరోపణలు వచ్చాయి. వీటితో పాటు ఇసుక దోపిడీ విషయంలో అన్ని హద్దులను చెరిపేసి ఇష్టారీతిన వ్యవహరించారు. ప్రస్తుతం వీటన్నింటి విషయంలో వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో అందిన వాటిపై...

జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడీతో పాటు అసైన్డ్ భూములు చెరబట్టడం వంటి వాటిపై రాష్ట్రస్థాయిలో అధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులను టీడీపీ నేతలు గతంలోనే చేశారు. ఇదిలాఉంటే పాలకపార్టీలోనే ఉన్న అసమ్మతి నేతలు ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న దోపిడీపై తాడేపల్లి పెద్దలకు పలు సందర్భాల్లో గతంలోనే ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం వీటన్నింటిని జిల్లా అధికారులకు పంపించి సమగ్ర విచారణ చేసి నివేదికలు ఇవ్వాలనే ఆదేశాలను ఇచ్చినట్లు తెలుస్తోంది.

కీలక నేత సహా.. మరెంతోమందిపై...

ఇసుక విషయంలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు తీసుకున్న ఓ సంస్థ వేమూరు నియోజకవర్గ పరిధిలో తమ ఒప్పందాన్ని ఉల్లంఘించే విధంగా ఓ కీలక నేత సారథ్యంలో ఇసుక అక్రమాలకు పాల్పడుతున్నారని అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్‌కు సదరు సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రస్థాయి డైరెక్టర్ ముందు ఈ విషయం ఉంచగానే నివేదిక తయారు చేసి పంపమన్న ఆదేశాలు వచ్చాయి. ఇది రుచించకనే ఆమెను ఆకస్మికంగా బదిలీ చేయించారనే ప్రచారం అప్పట్లో జోరుగా నడిచింది. ఇక బాపట్ల, చీరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇసుకాసురులు రెచ్చిపోయారు. ఏదో మొక్కుబడిగా అనుమతులు తీసుకోవడం, సొరంగాలను తలపించే విధంగా ఇసుకను తోడేసి కోట్లలో దండుకున్నారు. వీటిపై గతంలోనే నివేదికలను జిల్లా యంత్రాంగం పంపించింది. ఒకరిద్దరిపై భారీ స్థాయిలో జరిమానాలు సైతం వేసేందుకు సిద్ధమవగా రాజకీయ ఒత్తిళ్ల వల్ల అది సాధ్యపడలేదు. కానీ రిపోర్టులో మాత్రం ఎంతమేర దోపిడీజరిగింది, ఎన్ని కోట్ల వరకు జరిమానా వేయొచ్చు అనే వివరాలను పొందుపరిచారు. ప్రస్తుతం ఆ నివేదికలను ఆరా తీసే పనిలో వైసీపీ నేతలు ఉన్నారు.

రీసర్వేలో భాగంగా.. అసైన్డ్ బాగోతాలు..

ఇక భూముల విషయానికొస్తే ఇష్టారీతిన వైసీపీ నేతలు చెరబట్టారు. రీసర్వేలో భాగంగా వేటపాలెం మండలంలో దాదాపు 450 ఎకరాల అసైన్డ్ భూమి అనధికారికంగా చేతులు మారిందనే అంశాన్ని అధికారులు గుర్తించారు. దీనిలో కీలక నేత పాత్ర ఉందనే విషయాన్ని కూడా నిగ్గుతేల్చారు. ఈ అంశంపై కూడా సమగ్ర రిపోర్టును తయారు చేసి ఉన్నతాధికారులకు అందించారు. ఇక సూర్యలంక సముద్రతీరంలో నిరుపేద ఎస్టీల గుడిసెల తొలగింపు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీయడంతో అక్కడ జరుగుతున్న వ్యవహారంపై కూడా నివేదిక ఇవ్వాలనే ఆదేశాలు అప్పట్లో జిల్లా అధికారులకు అందాయి. అసైన్డ్ భూములను చెరబట్టి వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం జరుపుతున్న రిసార్టుల తంతు కూడా ఆ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. అటవీ భూములపై కూడా స్థానిక నేతలు కన్నేశారనే అంశంతో పాటు సముద్రతీరంలో వైసీపీ నేతల దందాపై కూడా ప్రస్తుతం దృష్టిసారించారు. ఇవన్నీ ఒక ఎత్తయితే మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు పరిధిలో గ్రానైట్ వ్యాపారులను బెదిరించి ఎంత దండుకున్నారన్నా అంశంపై కూడా సమగ్రంగా విచారణ చేపట్టనున్నారు.

వెలుగులోకి వస్తున్న వసూళ్ల పర్వాలు...

ఎన్నికల నిమిత్తం విరాళాల కోసం వ్యాపార వర్గాలతో పాటు వైసీపీ కొంతమంది వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వేధించింది. ఆ బాధితులలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం బాధితులందరూ ఒక్కొక్కరుగా బయటికొస్తున్నారు. త్వరలోనే ఈ ఫిర్యాదులన్నింటి మీద విచారణతోపాటు చర్యలు కూడాఉండే అవకాశాలు కనబడుతున్నాయి.

పదేపదే నోటీసులు జారీ చేసినా...

అక్రమాలకు పాల్పడే వారి విషయంలో జిల్లా యంత్రాంగం గతంలోనే పదేపదే నోటీసులు జారీ చేసింది. ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా 241 లే అవుట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వాటి యజమానులకు తాఖీదులు అందించడంతో పాటు లేఅవుట్లలో బోర్డులు కూడా పెట్టారు. వీటిలో మెజారిటీ శాతం అధికారపార్టీ నేతల అనుచరులవే కావడంతో ఏకంగా బోర్డులనే పీకేశారు. నోటీసులను చెత్తబుట్టలో పడేశారు. ప్రభుత్వం మారడంతో వాటిపైన కూడా సమగ్ర నివేదిక తయారు చేసే పనిలో యంత్రాంగం ఉంది.

వర్చువల్ శిక్షణకు.. మంగళం

- రూ.29.05 లక్షలతో ఏర్పాటు చేసిన స్టూడియో నిరుపయోగం
- శిథిలావస్థలో స్టూడియోలో డిజిటల్ పరికరాలు
- పాఠశాలలకు కేటాయించిన నిధులు ఏమయ్యాయో?



స్టూడియోలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (పాత చిత్రం)

గుంటూరు(విద్య), ఏప్రిల్ 27: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలనే లక్ష్యంగా నాటి టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియోను జగన్ ప్రభుత్వం మూలన పడేసింది. ఫలితంగా స్టూడియో కోసం వెచ్చించిన రూ.29.05 లక్షలు వృధాగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వర్చువల్ తరగతుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 2019 మొదట్లో జిల్లాలో 55 పాఠశాలల్లో వర్చువల్ తరగతులు ప్రారంభం తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో మరో 240 పాఠశాలల్లో వర్చువల్ తరగతులు ప్రారంభం అయ్యాయి. మరో మరో 100 పాఠశాలల్లో ప్రారంభం కావాల్సి ఉంది. ఈ తరుణంలో వచ్చిన జగన్ ప్రభుత్వం తీసుకున్న రివర్స్ చర్యల కారణంగా తాజాగా వర్చువల్ స్టూడియోలు నాలుగు సంవత్సరాలుగా మూతపడ్డాయి. మరోవైపు పాఠశాలలకు కేటాయించిన నిధులు ప్రభుత్వం దారిమళ్లించి అన్యాక్రాంతం చేసినట్లు ఆరోపణ ఉన్నాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో బోధన....

గ్రామస్థాయిలో ఉన్న పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైతం మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వర్చువల్ తరగతులు నిర్మాణానికి నాటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ఫైబర్ లిమిటెడ్ ఒక్కో పాఠశాలకు రూ.4.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో డిజిటల్ స్క్రీన్, కంప్యూటర్, ఆడియో వీడియో కెమెరాలు, పోడియం ఏర్పాటు చేశారు. తాజాగా పాఠశాలల్లో ఇవి ఉన్నాయో లేదో కూడా ఉపాధ్యాయులు చెప్పలేక పోతున్నారు. జిల్లాస్థాయిలో ఒక స్టూడియోలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సబ్జెక్టు పాఠాలు బోధిస్తుంటే వర్చువల్ తరగతులు ఉన్న పాఠశాలల్లో ప్రత్యక్షంగా చూసి నేర్చుకునే అవకాశం ఉంది. గుంటూరు నగరంలోని పరీక్షా భవన్‌లో రూ.29.5లక్షలతో స్టూడియో నిర్మాణం చేట్టారు. సెంట్రల్ ఏసీతో స్టూడియో ఏర్పాటు చేశారు. ఇదంగా ప్రస్తుతం వృధాగా మారింది. ఇందులో ఉన్న అత్యధునిక కెమెరాలు, ఒక గెస్ట్ రూమ్‌తోపాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు వీలుగా డిజిటల్ పరికరాలతో చేసిన ఏర్పాట్లు నిరుపయోగంగా మారాయి. ఇక్కడ తరగతులు చెబుతుంటే వర్చువల్ తరగతులు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు ప్రత్యక్షంగా వినే అవకాశం ఉంది. విద్యార్థులకు ఏవైనా సందేహాలు వచ్చినా క్లాసులో టీచర్‌ను అడిగినట్లే వెంటనే తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షణ.....

వర్చువల్ తరగతుల పర్యవేక్షణం కోసం ప్రభుత్వం అప్పట్లో జిల్లాకు ఒక కో ఆర్డినేటర్‌ను నియమించింది. ఆయన నేరుగా ప్రత్యేక యాప్ ద్వారా పాఠశాలల్లో వర్చువల్ తరగతులు అమలు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తారు. ఎప్పటికప్పుడు ఈ సమాచారం విజయవాడలోని సెంట్రల్ స్టూడియోకు అందజేస్తారు. ఉమ్మడి జిల్లాలోని స్టూడియోలతో విజయవాడలోని సెంట్రల్ స్టూడియో అనుసంధానం అయి ఉంటుంది. ప్రతి జిల్లాలో సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల్ని ఎంపిక చేసి వారికి వర్చువల్ తరగతులు బోధించడానికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు మొత్తం నిర్వీర్యం అయింది.



పరీక్షా భవన్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియో

పీడీసీసీ బ్యాంకు పీఐసీగా జేసీ

ఒంగోలు(విద్య), జూన్ 27 : ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికార పర్సన్ ఇన్‌చార్జ్(పీఐసీ)గా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో గత ఆరేళ్లుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. 2018తో సొసైటీ పదవీకాలం ముగియగానే నాన్ అఫిషియల్ కమిటీలను రంగంలోకి తెచ్చారు. గత ఐదేళ్ల కాలంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం లేదు. దీంతో ఇప్పటివరకు నాన్ అఫిషియల్ నామినేటెడ్ కమిటీలతోనే కాలయాపన చేశారు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినెటెడ్ నాన్ అఫిషియల్ కమిటీల రాజీనామాలు స్వీకరించి అఫిషియల్ పీఐసీలను నియామకం చేపట్టారు. ప్రస్తుతం బ్యాంకు పీఐసీగా నియమితులైన జేసీ ఆరునెలల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారు. నూతన పాలకవర్గం ఎన్నికలయ్యేంత వరకు ప్రతి ఆరునెలలకు వీరి పదవీ కాలాన్ని పొడిగించుకుంటూ పోతారు.

మార్కాపురం డీఎల్‌పీవో సస్పెన్షన్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27: మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించడంతోపాటు, కార్యాలయ నిర్వహణలో అలసత్వం వహించినందుకు మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి జి.నాగేశ్వరరావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కె.కన్నబాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాగేశ్వరరావు మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేయడంపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఆదేవిధంగా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కూడా ఓ మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా అలసత్వం వహించారు. కలెక్టర్ విచారణలో ఈ రెండు విషయాలు నిగ్గుతేలడంతో ఆ మేరకు అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. నివేదికను పరిశీలించిన కమిషనర్ డీఎల్‌పీఓ నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌తో కలిసి మహిళా ఉద్యోగినిని వేధింపులకు గురిచేయడాన్ని ఉన్నతాధికారులు పెద్ద నేరంగా పరిగణించారు. ఈ ఉత్తర్వులపై తగు చర్యలు తీసుకోమని కలెక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు.

పోలీసులు జవాబుదారీగా పనిచేయాలి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు క్రైం, జూన్ 27: పోలీసులు ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ కోరారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో ఉన్న తీవ్రమైన కేసులను సమీక్ష చేసి దర్యాప్తులో అవలంబించాల్సిన సూచనలను చేశారు. ఈనెల 29న జరగనున్న లోక అదాలత్ రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులు సత్వరం పరిష్కారం చేస్తూ పారదర్శకంగా పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని కోరారు. సిబ్బంది సంక్షేమం విషయంలో అధికారులు వేగవంతంగా స్పందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు యంత్రాంగం సమష్టిగా కృషిచేసిందని అభినందించారు. అంతేకాకుండా పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేసారు. ఎన్నికల విధుల్లో సమర్థవంతంగా పనిచేసిన అదనపు ఎస్పీలు కే.నాగేశ్వరరావు, ఎస్‌వీశ్రీధరరావు, డీఎస్పీలు రామరాజు, అశోక్‌వర్ధన్, బాలసుందరం, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖరరావు, పలువురు సీఐలు, ఎస్సైలు సిబ్బందిని ఈసందర్భంగా అభినందించారు. అదేవిధంగా అర్ధవీడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా ఆధారాలు సేకరించిన కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై ఎం.అనిత, కోటయ్య, కానిస్టేబుళ్ల లక్ష్మీనాయక్, హోంగార్డు ఎమ్.నాగరాజులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావుతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితాలు

ఒంగోలు(విద్య), జూన్ 27 : జిల్లాలోని హైస్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు డీఈవో ప్రకాశం వెబ్‌సైట్‌లో ఉంచినట్లుడీఈవో డి.సుభద్ర ఒక ప్రకటన లో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులకు తెలియజేయాలన్నారు అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాలను కూడా వారికి అందజేయాలన్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిశీలించి జాబితాలో ఏమైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరిచేసి అందుకు సంబంధించిన ఆధారాలతో నిర్ణీత ప్రొఫార్మాలో ఈనెల 29వతేదీ సాయంత్ర ఐదు గంటల లోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సుభద్ర కోరారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల మెరిట్‌జాబితా విడుదల

ఒంగోలునగరం, జూన్ 27: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో తుది మెరిట్‌జాబితాను గురువారం విడుదల చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన గ్రూపు 4, టెక్నికల్, క్లాస్ 4 పోస్టుల అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రకాశం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 30వ తేదీ లోగా జాబితాను పరిశీలన చేసుకోవాలని ఆ మె కోరారు. అభ్యర్థులు తమ వివరాల కోసం 28వ తేదీ నుంచి జాబితాను వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సూచించిన నివారణ పద్ధతులను పాటించాలన్నారు. శుభ్రమైన. సురక్షితమైన నీటిని తాగాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మరుగుదొడ్లను విధిగా ఉపయోగించాలని సూచించారు. తల్లిపాలు తాగే శిశువులకు అతిసార సోకినట్లయితే తల్లి పాలు ఇవ్వడం మానకూడదని, తగినంత పోషక అనుబంధ ఆహారంఇవ్వాలన్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా తీసుకొని ఆ మిశ్రమాన్ని ఒక లీటరు నీటిలో కలిపి అతిసార అయిన ప్రతిసారి ద్రావణం తాగిస్తూ ఉండాలన్నారు. అతిసార నివారణ, సహాం కోసం ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు అందుకోసం 9515324799 నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27: ఇంటర్,డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 700 ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు ఉండగా 3,629 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 173 డిగ్రీ కళాశాలల్లో 630 మంది కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని, వీరందరికి రెండు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల కాంట్రాక్టు లెక్చరర్లను వెంటనే రెన్యూవల్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


పీఎఫ్‌తో బహుళ ప్రయోజనాలు

ఒంగోలు(విద్య), జూన్ 27 : భవిష్యనిధి(పీఎఫ్) వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నందున ఉద్యోగులందరూ భవిష్యనిధి చందాదారులు కావాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. పీఎఫ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నిధి ఆప్‌కెనిఖిత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం. సమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆఫ్‌కెనిఖితపై వివరించారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ కృషి, కొత్త మార్పులను వివరించారు. ఈకార్యక్రమంలో వివేద రిసార్ట్స్ ఎండీ గోవిందరెడ్డి, జనరల్ మేనేజర్ షణ్ముఖ, రామారావు, శ్రీను, సత్యనారాయణలు పాల్గొన్నారు. వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేశారు.

సీనియర్ సిటిజన్లకు హెల్మెట్ నిబంధన సడలించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : సీనియర్ సిటిజన్స్‌కు హెల్మెట్ నిబంధనలను సడలించాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో కోరారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో హైవేలలో ప్రయాణించేసేవారు నిబంధనలు పాటించాల్సి ఉందన్నారు. అసలు డ్రైవింగ్ చేతకాని వారు, తాగి డ్రైవింగ్ చేసేవారి వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పట్టణాల్లో తిరిగే సీనియర్ సిటిజన్స్‌కు ఈ నిబంధనను సడలించాలని ఆయన కోరారు.

మైక్వీన్.. మాయ!



- మార్కాపురం డివిజన్‌లో రూ.10కోట్లకుపైగానే శఠగోపం
- ఆన్‌లైన్ లింకుతో ఘరానా మోసం
- ఆశల వలతో భారీగా వసూలు
- అంతా చైన్‌లింక్ ద్వారానే తతంగం
- నిండా మునిగిన ఉద్యోగులు, చిరువ్యాపారులు, యువత

మార్కాపురం/కంభం, జూన్ 27: ఎన్నిసార్లు మోసపోయినా అత్యాసపరుల తీరులో మార్పు రావడంలేదు. సులువుగా డబ్బు సంపాదించాలనే వారి బలహీనతలను కొందరు రెట్టింపుల ఆశచూపి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో మనుషుల ద్వారా ఆర్థిక మోసాలు జరిగితే నేడు అందుకు ఆన్‌లైన్ వేదికైంది. రూపాయి పెట్టుబడి పెడితే 5 నుంచి 10 రెట్ల వరకు నెల నెలా కొంత మొత్తం ద్వారా చెల్లింపులు జరుగుతాయని ఆశ పెడుతున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు సులువుగా ఆకర్షితులై అప్పులు చేసి మరీ పెట్టుబడి పెట్టి నట్టేట మునుగుతున్నారు. ఏడు రెట్లు మేర డబ్బులు వస్తాయని ఈ మధ్యకాలంలో మార్కాపురం డివిజన్‌లో మై క్వీన్ అనే యాప్‌లో రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. మార్కాపురం పట్టణంతోపాటు, గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట, యర్రగొండపాలెం, దోర్నాల, త్రిపురాంతకం తదితర మండలాల్లో మై క్వీన్ యాప్‌లో ఇరుక్కున్న వాళ్లు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. చైనా హ్యాకర్లు తయారు చేసిన ఆ యాప్‌కు విపరీతమైన ఫాలోయింగ్ ఉండటంతో వేలాది మంది అందులో సభ్యులుగా చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఆ యాప్ మూసివేయనప్పటికీ చాలామందికి యాప్ పేర్కొన్న మేర డబ్బులు తిరిగి రాకపోతుండటంతో మోసపోయామని మొల్లుమంటున్నారు. మార్కాపురం డివిజన్‌లోనే సుమారు 15 వేల మందికి పైగా అందులో సభ్యులుగా ఉన్నట్లు సమాచారం.

మధ్యవర్తుల ద్వారా లింకుతో...

మై క్వీన్ యాప్ నేరుగా ఇన్‌స్టాల్ చేసుకుంటున్న వాళ్లు తక్కువమందే. కానీ ఇప్పటికే అందులో సభ్యత్వం పొందిన వాళ్ల లింకు ద్వారా సభ్యులను చేర్పితే వారికి కమీషన్ ఇస్తున్నారు. ఈ లింకు ప్రక్రియ ద్వారానే మార్కాపురంతోపాటు జిల్లావ్యాప్తంగా వేలాదిమంది మై క్వీన్ యాప్‌లో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది. రూ.వంద నుంచి మొదలుకొని రూ.లక్షల్లో అందులో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం ఉంది. ఎక్కువశాతం మంది రూ.వేలల్లో అందులో డబ్బులు పెడుతున్నట్లు సమాచారం. లింకు ద్వారా యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత రూ.వందతో సభ్యత్వం తీసుకోవచ్చు. అందులో బ్యాంకు అకౌంట్ వివరాలు పొందుపర్చాలి. తర్వాత రోజుకు కొంత చొప్పున నెల రోజుల్లో రూ.100 సభ్యత్వం తీసుకున్న వారికి రూ.700లు అకౌంట్‌లో జమచేస్తారు. యాప్‌లో కొంతమేర రకరకాలైన సామగ్రిని కూడా ఉంచి అవి కొనుగోలు చేయాలని కూడా షరతులు ఉంటాయి. అంతేకాక తక్కువ మొత్తమైతే తక్కువ రోజుల్లో ఎక్కువ మొత్తంలో అయితే ఎక్కువ రోజుల్లో రోజుకు ఇంత చొప్పున టైమ్‌స్లాట్‌లో డబ్బులను సభ్యులకు జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొద్దికొద్దిగా డబ్బులు చెల్లిస్తుండడం, యాప్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వచ్చి పడడం చూసి మరింత మంది ఆకర్షితులయ్యారు. మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ ద్వారా పట్టణంలో ఎక్కువమంది యాప్‌కు ఆకర్షితులైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనది గౌరవప్రదమైన వృత్తి కావడంతో అందులో ప్రైవేటు ఉపాధ్యాయులు, చిరు ఉద్యోగులు పెట్టుబడి పెడుతున్నారు. లింకు పంపడం ద్వారానే నెలకు రూ.లక్ష వరకు సదరు ప్రిన్సిపల్ సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకరి ద్వారా ఒకరికి పాకి వేలాది మంది ప్రస్తుతం అందులో సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పటి వరకు మోసపోయామని ఎవరూ పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు చేయలేదు. కానీ ఆ యాప్ సేవలు ఆగిపోయిన తర్వాత పోలీసులను ఆశ్రయించాల్సిందేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్కీం వివరాలు ఇలా...

స్కీమ్ గురించి తెలుసుకుంటే ఒక్క రూపాయి కడితే రూ.7, రూ.100 కడితే రూ.700, ఇలా చెల్లిస్తామంటూ మధ్యతరగతి వారిని ఆసరాగా చేసుకొని వలవిసిరారు. వారి స్కీమ్ మాయలోపడి భారీ ఆదాయం వస్తుందన్న ఆశతో వేలమంది పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. మొదట్లో బాగానే డబ్బులు వచ్చాయి. అయితే రెండురోజుల నుంచి డబ్బులు రావడం లేదు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. అయితే దీని యజమాని ఎవరో, ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. చెన్నై కేంద్రంగా కేవలం ఆన్‌లైన్ ద్వారానే నగదు చెల్లింపులు జరిగాయి. ఈ స్కీమ్ చైన్ లింకు. సిస్టమ్‌లో మొదటి వ్యక్తికి లింకు పంపిస్తారు. ఆ వ్యక్తి మరో కొంతమందిని చేర్పిస్తే వారికి లింకు పంపిస్తారు. దీనిలో బ్యాంక్ అకౌంట్ లింకు చేసుకోవాలి. ఉదాహరణకు రూ.500 కడితే మరుసటి రోజు రూ.3500 అకౌంట్‌లో జమ అవుతుంది. దీంతో 30వేల మంది సభ్యులుగా చేరి దాదాపు రూ.10కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. స్కీమ్ ఎత్తివేస్తే పరిస్థితి ఏమిటని పలువురు చెప్పినా ఏమీ కాదు పోతే పోతాయి, లేకపోతే మా డబ్బులకు లాభం వస్తుంది కదా అని కొందరు చెబుతున్నారు. కొంతమంది అప్పులు చేసి మరీ స్కీమ్‌లో చేరారు. ఈవిషయంపై కంభం ఎస్సై పులి రాజేష్‌ను వివరణ కోరగా స్కీమ్ పేరుతో తాము మోసపోయామని బాధితులు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేస్తే విచారిస్తామన్నారు.

గతంలో మోసాలకు గురైనా నేర్వని గుణపాఠం

చెన్నై కేంద్రంగా పనిచేసిన హిమ్ అనే మని సర్క్యులేషన్ సంస్థ చేసిన నిర్వాకంతో 2011లో మార్కాపురం ప్రాంతంలో లక్షలాది మంది మోసపోయారు. అదంతా అప్పట్లో మనుషుల ద్వారా డబ్బులు సేకరించి సంస్థకు పంపే విధానంలో నడిచింది. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా అప్పట్లో కేవలం మార్కాపురం డివిజన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లు రూ.100 కోట్లకు పైగా నష్టపోయారు. హిమ్ సంస్థ కూడా మొదట్లో కొంతమేర సభ్యులకు చెల్లింపులు చేసింది. ప్రజల నుంచి ఎక్కువ మొత్తంలో సేకరించిన తర్వాత బోర్డు తిప్పేసింది. అప్పట్లో పేద, మధ్యతరగతి వర్గాలతోపాటు ఉన్నత వర్గాలకు చెందిన వాళ్లు కూడా భారీగా డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా అవి నీటి మీద రాతలే అయ్యాయి. హిమ్ తర్వాత మరో రెండు సంస్థలు కూడా ఆశల వల విసిరి మోసాలకు పాల్పడ్డాయి.

చూరకీ డిమాండ్

- కిలో రూ.180.. మేలురకం కిలో రూ.360
- సాధారణ పొగాకుతో పోటీపడుతున్న ధరలు
- పోటీపడి కొనుగోలు చేస్తున్న పలు కంపెనీలు
- పలు కేంద్రాల్లో అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తి



ఒంగోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పొగాకు చూర కూడా సాధారణ పంటతో పోటీ పడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకుతుండగా నాణ్యత ఏమాత్రం లేని లోగ్రేడ్‌లు సైతం రూ.200పైనే ఉంటున్నాయి. అదేసమయంలో పొగాకు చూరకు కూడా భారీ డిమాండ్ ఏర్పడింది. గరిష్ఠంగా కిలో రూ.180 వరకు పలుకుతుండగా నాసిరకం కూడా రూ.130పైనే పలుకుతోంది. అంతేకాక సాధారణ పొగాకు బేళ్ల కోసం పోటీపడినట్లే చూర కోసం కూడా పలు కంపెనీల బయ్యర్లు పోటీ పడుతుండటం విశేషం. ప్రస్తుతం పలు వేలంకేంద్రాలలో బోర్డు అనుమతించిన మేర పొగాకు కొనుగోళ్లు పూర్తి కావడంతో అధికారులు చూర బేళ్ల విక్రయాలకు అనుమతించారు. రెండు రోజులుగా పలు కేంద్రాల్లో చూర కొనుగోళ్లు జరుగుతుండగా వాటికి కూడా డిమాండ్ కనిపిస్తోంది. గతంలో చూర కొనుగోళ్లు వేలం కేంద్రాలలో జరిగేవి కావు. గ్రేడ్ చేసిన వివిధ రకాల బేళ్లను మాత్రమే కొనేవారు. మొత్తం బేళ్లను నాణ్యతను బట్టి మేలురకం, మీడియం, లో గ్రేడ్‌లుగా విభజించే వారు. వాటి నాణ్యతను బట్టి ధరలు లభించేవి.

గతంలో పడేసేవారు..

సాధారణంగా పొగాకు గ్రేడింగ్ సమయంలో చూర వస్తోంది. కాల్చు సమయంలో ఆకు అధికంగా కాలడం లేదా నాణ్యత సరిలేక పెళుసుగా ఉన్న చోట గ్రేడింగ్ సమయంలో ముక్కలు, ముక్కలుగా రాలి పడుతుంది. ఏ రోజుకారోజు గ్రేడింగ్ తర్వాత దానిని గతంలో నయ్యి దిబ్బల్లో రైతులు వేసేవారు. బ్యారన్‌కు కనీసం నాలుగైదు క్వింటాళ్ల ఇలా చూర వచ్చేది. దాని వల్ల ఆర్థికంగా రాబడి ఉండేది కాదు. అలాగే పొగాకు తోటల్లో రెలుపు ప్రక్రియ పూర్తి సమయంలో చివర రెండు, మూడు ఆకులు వదిలేసేవారు. టాప్‌లీప్ పేరుతో దీనిని వేలం కేంద్రాల వెలుపల కిలో రూ.15 నుంచి 20కి ప్రైవేటుగా కొనేవారు. అలాంటిది రెండేళ్లుగా చూర, టాప్‌లీప్‌లను కూడా వేలం కేంద్రాలలో కొనుగోలు చేస్తున్నారు. మంచి ధరలు కూడా వస్తున్నాయి. సిగరెట్ తయారీలో వీటి వాడకం వల్ల పలు కంపెనీల వారు సాధారణ పొగాకుతో సమనంగా వీటిని కూడా కొనుగోలు చేస్తున్నారు. అలా ఈ ఏడాది కూడా వేలం కేంద్రాలలో చూర కొనుగోళ్లకు బోర్డు అనుమతించింది.

అనుమతి వస్తే అధిక ఉత్పత్తి కొనుగోళ్లు

ఇప్పటిదాకా ఆయా వేలం కేంద్రాలలో సాధారణ పంట కొనుగోళ్లు జరుగుతున్నాయి. అయితే ఈ ఏడాది అనుమతి ఇచ్చిన దాని కన్నా దాదాపు 60శాతం అధికంగా ఉత్పత్తి జరిగింది. అధిక ఉత్పత్తి పంట కొనుగోలుకు ప్రత్యేకంగా బోర్డు అనుమతి ఇవ్వాల్సి ఉంది. అధిక పంటపై అపరాధ రుసుం రద్దు కోసం కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. అక్కడి నుంచి క్లియరెన్స్ వచ్చాక అధిక ఉత్పత్తి పంట విక్రయాలు చేసే అవకాశం ఉంది. ఈలోపు చూర విక్రయాలను బోర్డు చేపట్టింది. రెండు, మూడు రోజులుగా ఒంగోలు-1, -2, వెల్లంపల్లితో పాటు పలు ఇతర కేంద్రాల్లో చూర కొనుగోళ్లు జరుగుతున్నాయి. కాగా సాధారణ పొగాకుకు ఈ ఏడాది ఊహించని రీతిలో డిమాండ్ ఏర్పడి భారీ ధరలు పలుకుతున్న విషయం విదితమే. గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకుతుండగా సగటు ధరలు కూడా రూ.254 వరకు ఉన్నాయి. అదే రీతిలో చూరకు కూడా మంచి ధరలు లభిస్తున్నాయి. గరిష్ఠ ధర కిలో రూ.180 వరకు ఉండగా సగటున రూ.150 మేర లభిస్తోంది. ఒక్కొక్క బ్యారన్‌కు నాలుగైదు క్వింటాళ్ల చూర వస్తుండగా ప్రస్తుత ధరతో బ్యారన్‌కు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు రాబడి రానుంది. గతంలో నయ్యిదిబ్బల్లో వేసే చూరకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఏర్పడటంతో రైతులు ఊరట చెందుతున్నారు

లారీని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

మార్టూరు, జూన్ 27: జాతీయ రహదారిపై ఇసుక దర్శి ఫ్లైవోవర్‌పై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న తండ్రీకుమార్తెకు గాయాలైనట్లు తెలిసింది. వారిని హైవే అంబులెన్సులో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు కారులోని వ్యక్తులు విజయవాడ నుంచి బాడుగ కారులో ఒంగోలుకు వెళుతున్నారు. ముందు వెళుతున్న లారీ డ్రైవర్ లారీని స్లో చేయడంతో వేగాన్ని అదుపు చేసుకోలేని కారు డ్రైవరు లారీని ఢీకొన్నాడు. దాంతో కారులో డ్రైవర్ పక్కన ముందుసీటులో కూర్చున్న వ్యక్తివైపు లారీని కారు ఢీకొనడంతో ముందుసీటులో కూర్చున్న వ్యక్తికి వెనుక సీటులో ఉన్న అతని కుమార్తెకు గాయాలయినట్లు తెలిసింది. గాయపడిన వ్యక్తి విశ్రాంత ఇక ప్రభుత్వ అధికారి అని తెలిసింది. కారులో ఐదుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదం విషయం తెలియగానే హైవే అంబులెన్సువారు, హైవే మొబైల్ వారు సంఘటనా స్థలానికి రావడం బాధితులను అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, లారీ డ్రైవరు లారీని వదిలి పరారయ్యారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత బలవన్మరణం

చీరాలటౌన్, జూన్ 27: అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన అవ్వారు విజయ నిర్మల(42) గురువారం ఉదయం ఇంటి ప్రాంగణంలోని మరుగుదొడ్డిలో ఉరి వేసుకుని మృతిచెందారు. ఆమె భర్త శ్రీనివాసరావు పట్టణంలోని ఓ మిల్క్ డెయిరీలో పని చేస్తున్నాడు. వీరికి సాఫ్ట్‌వేర్, బీటెక్ సెకండియర్ చదవుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరుగుదొడ్డిలోని సీలింగ్‌కు ఉన్న కర్రలకు చీరతో ఉరికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27 : జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా బాధ్యతలు స్వీకరించారు. అన్సారియాను కలెక్టర్‌గా ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం పదిన్నర గంటలకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో బుధవారం రాత్రి ఒంగోలు చేరుకున్న తమీమ్ ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో బస చేశారు. గురువారం ఉదయం ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం పదిన్నర గంటలకు అన్సారియా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం నూతన కలెక్టర్‌ను కలిసి అభినందించేందుకు వచ్చిన జిల్లా అధికారులను జేసీ పరిచయం చేశారు. వివిధ శాఖల అధికారులు రవికుమార్, వెంకటేశ్వర్లు, ఉషారాణి, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సెక్షన్ల సూపరింటెండెంట్లు, వారి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఉద్యోగ సంఘాలతో పాటు వివిధ సంఘాల నాయకులు కూడా కలిసి అభినందించారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియాను ఎస్పీ గరుడ్ సుమీత్ సునీల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అదేవిధంగా మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌లు నూతన కలెక్టర్‌ను కలిసి అభినందించారు.

వెలిగొండను పూర్తిచేస్తాం

- నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 27: జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మీకోసం అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపైన దృష్టిపెడతామని తెలిపారు. జిల్లాలో ఉన్న తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా అవగాహన పెంచుకుంటామని వివరించారు. జిల్లాస్థాయిలోని సమస్యలను వీలైనంతా వరకు స్థానికంగా, మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో విద్య, వైద్యం పారిశుధ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారిత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషిచేస్తానని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తాను 24/7 అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఫోన్ కూడా చేయవచ్చని తెలిపారు. లేనిపక్షంలో వాట్సాప్, ట్విట్టర్, ఈమెయిల్‌లో కూడా ఆయా సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని అన్సారియా తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అద్దంకి, జూన్ 27: గుర్తు తెలియని వాహనం ఢీకొని గజ్జల సుబ్బడు (33) అనే వ్యక్తి మృతి చెందగా, ఇయన కుమారుడు కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీకి చెందిన గజ్జల సుబ్బడు కొడుకుతో కలిసి మోటార్‌సైకిల్‌పై శింగరకొండ వైపు వెళ్తుండగా ఉదయం 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సుబ్బుడు అక్కడికక్కడే మృతి చెందగా, కార్తీక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. కార్తీక్‌ను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు చేర్పించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సుబ్బడుకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. భార్య నాగేంద్రం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రిసార్టుల అనుమతులపై ఆరా..!

» నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలేంటి..?

» ఆరంభశూరత్వమేనా ... అంతిమంగా కొనసాగేనా...?



హైకోర్టుకు కేటాయించిన స్థలం నుంచి వేసిన దారి

చీరాల, జూన్ 27 : గత వారం, పది రోజులుగా తీర ప్రాంతంలో రిసార్టుల నిర్వాహకుల తీరు, తెన్నులు, జరుగుతున్న ప్రాణనష్టంపై ప్రభుత్వం స్పందించింది. అధికారులు తగిన కార్యాచరణతో పని చేస్తున్నారు. అయితే కార్యాచరణ అమలు ఎప్పటి నుంచి అనే విషయమై స్పష్టత లేకపోవడంపై ప్రజలు, పర్యాటకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ క్రమంలో రిసార్టులకు సంబంధించిన ఆయా శాఖల అనుమతులు ఎవరెవరికి ఉన్నాయి. ఎవరికి లేవు. లేని వారిపై ఎలాంటి చర్యలు చేపట్టవచ్చనే కోణంలో ఆరా తీసిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిజాయతీగా పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామనే భావనతో చర్యలు చేపట్టిన పాలకులు, అధికారులుపై ఆరోపణలు చేస్తూ కొందరు రిసార్టుల నిర్వాహకులు తమ స్వరం వినిపిస్తున్నారు. దీంతో సదరు వ్యక్తుల ఆరోణలకు రుజువులు చూపాలి. లేదంటే వారి కుంచిత స్వభావానికి ఎవరిపై ఆరోపణలు చేశారో వారికి క్షమాపణలు చెప్పాలని తీరప్రాంత ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఇలాంటి అభాండాలు, ఆరోపణలు వండి వార్చి ఎలాంటి రక్షణ, అభివృద్ధి చర్యలకు సంబంధీకులు అడుగులు వేయకుండా ఎదురు దాడి చేసేవారికి చెక్ చెప్పాల్సిన అవసరం ఉందంటున్నారు.

వైజాగ్ కన్నా మిన్నగా..

ఆంధ్రా గోవాగా బాపట్ల, చీరాల నియోజకవర్గాల పరిధి ఇవలోని తీరప్రాంతం అభివృద్ధి చెందేందుకు ఎంతో అవకాశం ఉంది. స్థానిక స్థితిగతులు, ఉన్న వనరులు అందుకు కారణం. అయితే ఆయా తీరప్రాంతాల్లో నెలకున్న పరిస్థితులు, జరుగుతున్న ప్రాణనష్టం అందరినీ కలవరపరుస్తోంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే సూర్యలంక నుంచి వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం వరకు ఉన్న తీరప్రాంతం పర్యాటకులకు ఆనందాన్నిచ్చే విధంగా ఉంటుంది. అయితే ఆయా ప్రాంతాల్లో ఉన్న రిసార్టుల్లో నూటికి 90 మందికి పూర్తిస్థాయి అనుమతులు లేవు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే వరకు వారి పేర్లు చెప్పి దందా సాగించేవారికి చెక్ చెప్పాలి.

వందకు పైగా రిసార్టులు.. పూర్తిస్థాయి అనుమతులు ఉంది నామమాత్రమే

జిల్లాలోని తీరప్రాంతంలో పూర్తి స్థాయి అనుమతులు ఉన్న రిసార్టులు నామమాత్రమే. సింహభాగం రిసార్టులకు పూర్తి స్థాయి అనుమతులు లేవు. అయినప్పటికీ సదరు రిసార్టుల నిర్వాహకులు ఎవరు అధికారంలో ఉంటే వారికి కొమ్ముకాస్తూ, ఏ ఎండకు ఆ గొడుగు అన్న చందంగా తమ పబ్బం గడుపుకుంటున్నారు. తాజాగా ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య రిసార్టులకు సంబంధించిన వ్యవహారాలను పక్కాగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. లేదంటే నిబంధనలు మేరకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కొండయ్యపై ఎదురుదాడి..

అనుమతులు లేని రిసార్టుల నిర్వాహకుల్లో ఓ వ్యక్తి ఎమ్మెల్యే కొండయ్యపై ఎదురుదాడికి దిగాడు. కొండయ్యకు మకిలి అంటించేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. అయితే ఇతర రిసార్టుల నిర్వాహకులు అతనికి మద్దతు తెలపకపోవడం విశేషం. తీరానికి వచ్చే పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే కొండయ్య సూచనలు పాటిస్తారా . లేదంటే వేచిచూసే ధోరణిని కొనసాగిస్తారా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత సదరు రిసార్టుల నిర్వాహకులపై ఉంది. అంతిమంగా ఏ నిర్ణయాలు తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

హైకోర్టుకు కేటాయించిన స్థలం నుంచి రోడ్డు

రామాపురం, కఠారివారిపాలెం మధ్య తీరం వెంట ఉన్న రోడ్డుకు సమీపంలో నిర్మించిన ఓ రిసార్టు నిర్వాహకుడు ఏకంగా హైకోర్టు అవసరాలకు కేటాయించిన స్థలంలో తన రిసార్టుకు దారిని ఏర్పాటు చేసుకున్నాడు. ఇలాంటి అతిక్రమణలు తీరప్రాంతంలో పదులు కొద్దీ ఉన్నాయి. అలాంటివాటని క్రమబద్ధీకరించాల్సిన అవసరం పాలకులు, అధికారులపై ఉంది.

ఎదురుదాడికి దిగేవారిని ఉపేక్షించ కూడదు

ఒకవైపు తాము నిబంధనలు పాటించడం లేదని రిసార్టుల నిర్వాహకులకు తెలుసు. అయితే దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఓ రిసార్టు నిర్వాహకుడు కొందరిని కూడగట్టి ఎవరైతే ప్రక్షాళన చర్యలకు శ్రీకారం చుట్టారో వారిపై ఆరోపణలకు దిగి, వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది. అయితే వారి ఉడత ఊపులకు బెదరకుండా సంబంధీకుల తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.



అద్దంకి మున్సిపల్ కార్యాలయం

వైసీపీ కౌన్సిలర్‌ల తీరు మారేనా..?

» అద్దంకి మున్సిపల్ సమావేశాలు సజావుగా జరిగేనా

» ప్రతి కౌన్సిల్‌లోనూ టీడీపీ కౌన్సిలర్‌లపై హేళన

అద్దంకి, జూన్ 27 : అద్దంకి మున్సిపల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్‌ల తీరులో ఇకనైనా మార్పు వస్తుందా.. లేక పాత పద్ధతినే కొనసాగిస్తారా అన్నది సర్వత్రా చర్చగా మారింది. మున్సిపల్ పాలక మండలిలో వైసీపీకి 13 మంది, టీడీపీకి 7 మంది కౌన్సిలర్‌లున్నారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు వైసీపీ అధికారంలో ఉండడం, మున్సిపాలిటీలోనే వైసీపీ కౌన్సిలర్‌ల బలం ఉండటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అందరు కౌన్సిలర్‌లు సమానమే అనే భావనే లేకుండా ఇష్టానుసారం వ్యవహరించారు. మున్సిపల్ సమావేశాలలో సైతం ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ కనీసం మహిళా కౌన్సిలర్‌లు అని కూడా చూడకుండా హేళనగా మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయి. అదే సమయంలో మహిళా కౌన్సిలర్‌లు మాట్లాడే సమయంలో కొందరు కౌన్సిలర్‌లైతే అత్యుత్సాహంతో రన్నింగ్ కామెంటరీ కూడా చేసారని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇక టీడీపీ కౌన్సిలర్‌లు ప్రాతినిథ్యం వహించే వార్డులలో అభివృద్ధి పనుల విషయమై ప్రస్తావనే లేకుండా పోయింది. టీడీపీ కౌన్సిలర్‌లు ఇచ్చిన సమస్యలను కనీసం అజెండాలో చేర్చేందుకు కూడా వైసీపీ కౌన్సిలర్లు ఇష్టపడని పరిస్థితి. అయితే ప్రస్తుతం టీడీపీ కూటమి అధికారంలో ఉండడంతో పాటు ఇద్దరు వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీకి మద్దతుగా నిలబడడం, ఇంకా పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుండడం తో శుక్రవారం జరుగుతున్న మున్సిపల్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత పరిస్థితులలో గతంలో అత్యుత్సాహం చూపించిన వైసీ పీ కౌన్సిలర్‌లు తమ పంథా మార్చుకొని వ్యవహరిస్తారా లేక అదే పద్ధతిలో పో యి అభాసుపాలవుతారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. గతంలో అవమానా లు పడ్డ టీడీపీ కౌన్సిలర్‌లు శుక్రవారం నాటి మున్సిపల్ సమావేశంలో ఒకింత హవా సాగించే విధంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి మున్సిపల్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

డయేరియాపై జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, జూన్ 27 : చీరాల మండల పరిధిలో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శోభారాణి అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, వెలుగు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వర్షాలు పడనున్న నేపథ్యంలో క్లోరినేషన్, క్లోరోస్కోప్ సేకరణ, డ్రై డే కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఆరోగ్య సిబ్బంది డ్రింకింగ్ వాటర్ సోర్స్ టెస్టింగ్ చేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్ఈవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రామ్‌కుమార్, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, డా.శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బాపట్ల బ్రాంచ్ వారు ది.08-6-2024న ప్రచురించిన ఆనోటి వరలక్ష్మి గారి యాడ్‌లో లోన్ పేరు ఆనోటి వెంకట కోటేశ్వరరావు అని తప్పుగా పడినది. దీనిని ఆనోటి వరలక్ష్మి గా చదువు కోగలరు.

బండా విజయకుమార్, బండా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

అమరావతి రైతులకు ఘన స్వాగతం

పర్చూరుకు చేరిన పాదయాత్ర



పాదయాత్ర సాగిస్తున్న అమరావతి రైతులు

పర్చూరు, జూన్ 27 : టీడీపీ ప్రజా కూటమి విజయం సాధించడం, నవ్యాంధ్ర రాజధానికి పూర్వ వైభవం తెచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న చర్యలపై అమరావతి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవ దేవుళ్లకు, న్యాయ దేవుళ్లకు, ఓటరు దేవుళ్లకు వందనాలు అంటూ రైతులు చేపట్టిన కృతజ్ఞతా పాదయాత్ర గురువారం పర్చూరుకు చేరింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి వృద్ధులు, చిన్నారుల సైతం పాదయాత్రగా బయలు దేరి స్వామివారికి మొక్కు తీర్చుకోనున్నారు. ఐదేళ్ల రాక్షక పాలనకు ఓటరు దేవుళ్లు అంతం పలికారని పాదయాత్రకులు పేర్కొన్నారు. ఇక భవిష్యత్ అమరావతిదేనని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి పఠాన్ సమీర్ ఆధ్వర్యంలో నాయకులు, శ్రేణులు అమరావతి రైతులకు ఘనంగా స్వాగతం పలికారు.



పేదలకు న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్న ప్రతినిధులు

పౌష్టికాహారంతో రోగాల నుంచి విముక్తి

చీరాలటౌన్, జూన్ 27 : రోగాల బారిన పడిన వారు పౌష్టికాహారంతో విముక్తి పొందవచ్చని మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి, జిల్లా డీపీఎం బాషా అన్నారు. ఆశా రేఖ మహిళా మండలిలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు పర్చూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు సుధ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక స్థైర్యంతో ముందుకు సాగితే జీవితాలు సంతోషంగా సాగుతాయన్నారు. దాతలు సుధ మాట్లాడుతూ ప ర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు అన్ని ప్రాంతా ల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ పీడీ శ్రీనివాసరెడ్డి, సీబీవో అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సభ్యత్వాలను నమోదు చేస్తున్న సంఘ నేతలు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

పంగులూరు, జూన్ 27 : విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఏపీటీఎఫ్ సంస్థలో ప్రతి ఉపాధ్యాయుడు సభ్యులుగా చేరాలని సంఘ జిల్లా ప్రతినిధులు కంకణాల శ్రీనివాసరావు, చేజర్ల చెంచురామారావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు, కొప్పెరపాడు, తక్కెళ్లపాడు, అలవలపాడు, రేణంగివరం, జేపీపాలెం, ముప్పవరం పరిసర గ్రామాలలో గురువారం ఏపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తస్నీరు వెంకటరావు, రహంతుల్లా, సంఘ ప్రతినిధులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

అద్దంకి, జూన్ 27 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయం అని రోటరీ పూర్వ అసిస్టెంట్ గవర్నర్ వీరవల్లి సుబ్బారావు రుద్రయ్య అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ కమిటీ అభినందన సభ గురువారం రాత్రి స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో జరిగింది. ఈ సందర్భంగా 2023-24 సంవత్సర అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, కార్యదర్శి చప్పిడి వీరయ్య, కోశాధికారి కొల్లా భువనేశ్వరి, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో వీరవల్లి సుబ్బారావు(రు ద్రయ్య), పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఉబ్బా దేవపాలన, గాడేపల్లి దివాకర్‌దత్, అన్నంగి సుబ్బారావు, ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, డాక్టర్ ఖాజావలి, సయ్యద్ మౌలాలి, నర్రా శ్రీలక్ష్మి, సంది రెడ్డి శ్రీనివాసరావు,మహ్మద్ రఫీ, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంబొట్లవారిపాలెంలో చోరీ

తాళం వేసి ఉన్న ఇంట్లో సొత్తు అపహరణ

అన్నంబొట్లంవారిపాలెం (పర్చూరు), జూన్ 27 : పర్చూరు మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మర్రి జానకి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుని అమెరికాలో ఉంటున్న తన కుమారుని వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న రూ.20 వేల నగదు, 2 శవర్ల బంగారు అభరణాలు, 3 కేజీలకు పైగా వెండి వస్తువులను దొంగిలించారు. జానకి అమెరికా వెళుతూ పనిమనిషికి ఇంటి బయట ప్రాంగణాన్ని శుభ్రపరిచే విధంగా బాధ్యత అప్పగించింది. రోజు మాదిరిగానే బుధవారం శుభ్రపరిచేందుకు వచ్చిన తరుణంలో ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించిన పని మనిషి స్థానికంగా ఉన్న బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువులు ఫోన్ ద్వారా అమెరికాలో ఉన్న జానకికి సమాచారం ఇచ్చారు. పర్చూరు ఎస్ఐ ఎస్.రమేష్ తన సిబ్బందితో, సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం ఇంట్లో నమూనాలను సేకరించారు. దీనిపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 27 : మండలంలో కౌలు రైతులు గుర్తింపుకార్డులకు దరకాస్తు చేసుకునేలా వారికి అవగాహన కలిగించాలని తహసీల్దారు వై.నాగరాజు కోరారు. గురువారం కార్యాలయంలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందే విధంగా వారికి సూచనలు చేయాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుంచి పొందే ప్రయోజనాలను వారికి వివరించాలన్నారు. వ్యవసాయంలో కౌలు రైతులకు కూడా లబ్ధి చేకూరడంపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా పత్రాల కోసం దరకాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం కొంతమంది కౌలు రైతులకు ధ్రువపత్రాలను తహసీల్దారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ మస్తానరావు, విష్ణు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం



మాట్లాడుతున్న సీపీఐ నేత మేడా

చీరాల, జూన్ 27 : మండలంలోని ఈపురుపాలెంలో జరిగిన యువతి హత్యాచారం ఘటనకు సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈపురుపాలెంలో యువతి హత్యాచార ఘటన అత్యంత దారుణమన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన నిందితులకు విధించే శిక్ష భవిష్యత్‌లో మరోసారి జరుగకుండా ఉండేలా భయం కల్పించే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

అద్దంకి, జూన్ 27 : అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ సత్యనారాయణ తెలిపారు.

రేపు ప్రతిభామూర్తులు - మధురస్మృతులు సభ

అద్దంకి, జూన్ 27 : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన సాయంత్రం 6 గంటలకు బంగ్లా రోడ్డులోని చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవాసదన్‌లో ప్రతిభామూర్తులు - మధురస్మృతుల సభ జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య తెలిపారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

అద్దంకి, జూన్ 27 : బడిఈడు పిల్లలు అందరూ కచ్చితంగా బడిలోనే ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో-1 గంగాధర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మార్సీలో జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు మాట్లాడుతూ జూలై-1వ తేదీ నుంచి డయేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభమవుతుందని, హ్యాండ్ వాష్ కార్యక్రమం అన్ని పాఠశాలలో తరచూ నిర్వహించాలన్నారు. డయేరియా పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో హెల్త్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

కారంచేడు(పర్చూరు), జూన్ 27 : రైతులు మట్టినమూనా పరీక్షలు చేయించుకుని భూమిలోని పోషక పరిస్థితి తెలుసుకొని తద్వారా పంటలను సాగుచేసుకుంటే నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని కారంచేడు ఏవో సుధీర్ బాబు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2024-25కు సంబంధించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఉచిత మట్టి పరీక్షలకు సంబంధించి రైతులకు గ్రామ వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రైతు తప్పక మట్టి నమూనా పరీక్షలు చేయించుకున్న తరువాతే సాగుచేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



రైతు సంఘం ప్రతినిధులతో కృష్ణయ్య

పంగులూరు, జూన్ 27 : సమస్యల పరిష్కారానికి రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని అవసరం ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో గురువారం రైతు సంఘం నాయకులు మానం హరిబాబు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల సమావేశంలో కృష్ణయ్య పాల్గొన్నారు. మండలంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రధాన కాలువలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మేజర్ కాలువల్లో దట్టంగా పెరిగిన చిల్ల చెట్లను తొలగించి నీటి పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సాగర్ కాలువలతో పాటు సాగునీటికి అవకాశాలున్న భవనాసి, పోలిరెడ్డి ఎత్తిపోతల పథకా లను సత్వరమే పూర్తిచేయాలని, వాటి సాధన కోసం రైతులు ఉద్యమించాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. వ్యవసాయంలో కష్టపడి పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పూర్తి స్థాయిలో అందచేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. "సమావేశంలో జిల్లా కార్యదర్శి కందిమళ్ల రామకోటేశ్వరరావు, తలపనేని రామారావు, రైతుసంఘం నాయకులు గుడిపాటి మల్లారెడ్డి, గరికపాటి శంకర్, నాదెళ్ల శ్రీనివాసరావు, సురేష్, వెంకటరావు ,ఆంజనేయు లు, కరణం రామయ్య, శేఖర్, నాయపాము ప్రభాకరరావు, తానికొండ సుధాకర్, తలపనేని సుధకర్‌రావు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ ఫలితాల్లో శ్వేత ప్రతిభ

» రాష్ట్రస్థాయిలో సోషల్ విభాగంలో ఫస్ట్‌ర్యాంక్

» అభినందించిన మంత్రి రవికుమార్



మేదరమెట్ల, జూన్ 27: బీఈడీ, బీఈడీ స్పెషల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష ఫలితాల్లో కొప్పుల శ్వేత సాంఘిక శాస్త్రంలో స్టేట్ ఫస్ట్ వచ్చారు. గురువారం విడుదలైన పరీక్ష ఫలితాలలో కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన శ్వేత అద్భుతమైన ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మొదటిర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్వేతకు అభినందనలు తెలియజేశారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని నేటి యువత చదువుల్లో రాణించి పుట్టిన ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. మహిళలు విద్యలో రాణించడం వలన కుటుంబానికే కాక రాష్ట్రానికి, దేశానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌కు ప్రత్యేకాధికారిగా జేసీ

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ది నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలకు ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బీ రాజశేర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఆరు నెలల కాలానికి ప్రత్యేకాధికారిగా నియమించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌డీసీఎంఎస్, ఎన్‌డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్లు రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం జాయింట్ కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడం విశేషం.



సహస్ర లింగేశ్వరా..

నీ భూమిని నువ్వే కాపాడుకో!

2023, నవంబరు 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన విలువైన భూమి పేదల ముసుగులో వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయిందని కథనాన్ని ప్రచురించింది. ఈ కబ్జా పర్వంపై అధికారులు స్పందించినట్లు నటించారు. ఈ భూమి అన్యాక్రాంతం కావడానికి వీల్లేదన్నారు. చర్యలు తీసుకుంటామన్నారు. చివరకు అవన్నీ ఒట్టి మాటలే. అధికారంలో ఉన్న వైసీపీ నాయకుల ఆదేశాల మేరకు నిజాలకు పాతరేశారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు వదిలిపెట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా సహస్ర లింగేశ్వరస్వామి భూమికి అక్రమార్కుల చెర నుంచి విముక్తి లభిస్తుందా!? లేదా!? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



గతేడాది నవంబరు 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

- పత్రికలు ఘోషించినా స్పందించని యంత్రాంగం
- ఫోర్జరీ పట్టాలతో రూ.5 కోట్ల స్థలం కబ్జా
- తెరవెనుక వైసీపీ నేతల హస్తం
- అధికారం అండతో విచారణ ఫైలు బుట్టదాఖలు
- విక్రయ పత్రాల్లో వైసీపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుల పేర్లు
- టీడీపీ పాలనలోనైనా న్యాయం జరిగేనా!?

జరిగిన కథ ఇది

2022, ఫిబ్రవరి. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని గచ్చుకాలువ విస్తరణ పనులు మొదలయ్యాయి. ఈ కాలువ మీద కాపురం ఉంటున్న పేదలకు పునరావాసం చూపించాలన్న ఉద్దేశంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం 41వ డివిజన్‌లోని ఇరగాళమ్మ సంఘం ప్రాంతంలో సహస్ర లింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 0.85 సెంట్ల భూమిని ఎంచుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆరు అంకణాలు చొప్పున 47 ప్లాట్లు వేశారు. గచ్చుకాలువ మీద ఉన్న 12 మంది పేదలకు పట్టాలు సిద్ధం చేశారు. అయితే ఆ పేదలు గచ్చుకాలువ ప్రాంతాన్ని వదిలి ఇక్కడికి రావడానికి ఇష్టపడలేదు. పట్టాలు తీసుకున్న కొందరు కూడా తిరిగి ఇచ్చేశారు. కొంతకాలం సదరు భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉండిపోయింది.

2023లో..

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసీపీని వదిలి టీడీపీలో చేరడంతో రూరల్ ఇన్‌చార్జిగా ఆదాల ప్రభాకరరెడ్డిని నియమించారు. సరిగ్గా అప్పుడే ఈ భూమిని దిగమించే కుట్రకు తెరలేచింది. ఆదాల అనుచరులుగా ముద్రపడ్డ కొంతమంది వైసీపీ నాయకులు ఫోర్జరీ పట్టాలతో స్వాహా చేయడానికి ప్రయత్నించారు. ఈ అక్రమార్కుల్లో స్థానిక వైసీపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు తహసీల్దారు ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించారు. ఆరు అంకణాలుగా ఉన్న ప్లాట్లను 36 అంకణాల బిట్లుగా తయారు చేసి కార్పొరేషన్‌లో వాటికి వేకెంట్‌ల్యాండ్ పన్ను వేయించుకున్నారు. దానిని ఆధారంగా చూపి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకున్నారు. విక్రయించిన వారిలో స్థానిక కార్పొరేటర్ కుటుంబ సభ్యులు కూడా ఉండటం గమనార్హం.

స్పందించినట్లు నటించిన అధికారులు

ఈ అక్రమాన్ని అప్పట్లోనే ఆంధ్రజ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించినట్లు నటించారు. ప్రభుత్వ స్థలాన్ని, అందునా పేదల కోసం కేటాయించిన స్థలాన్ని ఎలా రిజిస్టర్ చేస్తారో అర్థం కావడం లేదని నటించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షిస్తామని ప్రకటించారు. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భూమి అక్రమార్కుల పేరుమీదే భద్రంగా ఉంది.

ఇప్పుడైనా స్పందిస్తారా!?

ప్రభుత్వ భూమికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ వేయడం కార్పొరేషన్ అధికారుల తప్పు. రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా రిజిస్టర్ చేయడం రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తప్పు. వీటన్నిటికన్నా ముఖ్యంగా ప్రభుత్వ భూమికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయకపోవడం ఇంకా పెద్ద తప్పు. అధికారులు వైసీపీ నాయకుల పెత్తనానికి లొంగకుండా వ్యవహరించి ఉంటే తొలుత చేయాల్సిన పని ప్రభుత్వ భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. వెంకటగిరిలో సహకార డెయిరీ భూమిని ఇలాగే మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అప్పటి గూడూరు సబ్ కలెక్టర్ రోజుల వ్యవధిలో ఆ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయడంతో పాటు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. నిజంగా అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇదివరకెప్పుడో ఈ భూమిపై జరిగిన రిజిస్ట్రేషన్లు రద్దు చేసి ఉండేవారు. అలా చేయకపోగా, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా వైసీపీ నాయకుల అక్రమాలను చూసీచూడనట్లు వదిలేశారు. అక్రమార్కులేమో పత్రాలను చేతపట్టుకొని భూమి తమదేనంటూ దర్జాగా తిరుగుతున్నారు.

ఎమ్మెల్యే గారూ స్పందించండి!

పరులపాలైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే విషయంలో స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవ చూపాలని ఇరుగాళమ్మ సంఘం పరిసర ప్రాంత పేదలు కోరుతున్నారు. ఈ అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సుమారు రూ.5 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయించి ఈ భూమిని స్థానిక పేదల కోసమో, ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని కోరుతున్నారు.

బుచ్చిలో భారీ చోరీ

- తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు
- 40 సవర్ల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణ
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ పరిశీలన



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 27 : బుచ్చిరెడ్డిపాళెంలోని బ్రాహ్మణవీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చొరబడి 40 సవర్ల బంగారు, రూ.3 లక్షల నగదు దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. బ్రాహ్మణవీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు పత్తిపాటి వెంగళరావు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి నర్రవాడలో వెంగమాంబ తిరునాళ్లకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు తొలుత ఇంటి బయట గేటుకున్న తాళం, ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బెడ్‌రూంలో బీరువాను పగలగొట్టి భారీగా నగదు, బంగారు ఆభరణాలు దోచుకున్నారు. బీరువాలో నుంచి తీసి బెడ్‌పై వేసిన చీరల మడతల్లోని కొన్ని ఆభరణాలు కనిపించక పోవడంతో వాటిని వదిలేశారు. ఆ తర్వాత ఇంటి వెనుక వైపు నుంచి వెళ్లిపోయారు.

● కుమార్తె పెళ్లి కోసం..

వెంగళరావు తన కుమార్తె శశి కోమలి పెళ్లి ప్రయత్నాల నిమిత్తం బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు ఇంట్లో భద్రపరిచారు. అలాగే బుధవారం అత్తామామలు ఇచ్చిన రూ.3 లక్షల నగదునూ ఇంట్లో ఉంచినట్లు బాధితులు తెలిపారు. నర్రవాడకు వెళ్లిన వెంగళరావు భార్య, కొడుకు, అత్తామామలు అక్కడే ఉండిపోగా కుమార్తెతో కలిసి వెంగళరావు గురువారం సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి ఉండటం, ఇంట్లో నగదు, నగలు చోరీకి గురైనట్లు గుర్తించి 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న నెల్లూరు సీసీఎస్ క్రైం అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ రామకృష్ణాచారి, సీఐ చిట్టెం కోటేశ్వరరావు, బుచ్చి సీఐ హైమారావు ఇంటిని పరిశీలించి, వివరాలు సేకరించారు. 40 సవర్ల బంగారం, రూ.3లక్షలు నగదు చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. క్లూస్‌టీం నిందితుల వేలిముద్రలు సేకరించగా, పోలీసు జాగిలం కూడా రోడ్డుమీదకు కొంతదూరం వచ్చి ఆగింది. ఈ చోరీని సవాల్‌గా తీసుకున్న పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు. అయితే, బాధితులు భారీగా నగదు, నగలు అపహరణకు గురైనట్లు వాపోయారు.

అనధికార పొగాకు బ్యారన్లు నిర్మించి నష్టపోవద్దు : ఆర్‌ఎం

కందుకూరు, జూన్ 27: పొగాకుకు ప్రస్తుతం లభిస్తున్న గిట్టుబాటు ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులు అనధికార పొగాకు బ్యారన్లు నిర్మించి నష్టపోవద్దని పొగాకుబోర్డు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు రైతులకు సూచించారు. గురువారం కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకు సూర, ముక్క వేలంను ఆయన ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల బయ్యర్లతో మాట్లాడుతూ సూర, ముక్కలకు మంచి ధర ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులు కూడా గతంలోలా సూర, ముక్క పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నాణ్యంగా బేళ్లు కట్టుకుని తీసుకురావాలన్నారు. అనధికారికంగా బ్యారన్లు నిర్మించటం, అధిక రేటుకు భూములు, బ్యారన్లను కౌలుకు తీసుకుంటే నష్టపోతారని హెచ్చరించారు. అనధికార బ్యారన్లు నిర్మించే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు సాగుచేసే భూముల్లో విధిగా పచ్చిరొట్ట పైర్లు వేసి 40రోజుల పైరుదశలో భూమిలో కలియదున్నాలని ఇలా చేయటం వల్ల నాణ్యమైన పొగాకు దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి, రైతుప్రతినిధులు ఉన్నారు.

ఐటీడీఏ పీవో మాతృశాఖకు బదిలీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 27 : నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా రాణిని విశాఖపట్నంలోని మాతృశాఖ అయిన టీసీఆర్ అండ్ టీఎంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిరిగి పంపారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలు ఆరోపణల నేపథ్యంలో మందరాణిపై జడ్పీ సీఈవో కన్నమ నాయుడును కలెక్టర్ హరినారాయణన్ విచారణాధికారిగా నియమించారు. కన్నమనాయుడు మంగళ, బుధవారాల్లో ఐటీడీఏ కార్యాల యంలో ఫైళ్ల తనిఖీతోపాటు ఫిర్యాదుదారుడైన గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యను విచారించారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ నేపథ్యంలో పీవో మందారాణిని మాతృశాఖకు పంపటం చర్చనీయాంశమైంది. కాగా, పీవో రాణి స్థానంలో డీటీడబ్ల్యూవో పరిమళను ఇన్‌చార్జిగా నియమించారు.

ఏపీ పీజీసెట్ ఫలితాల విడుదల

● జిల్లా విద్యార్థులకు ర్యాంకులు

నెల్లూరు (విద్య): రాష్ట్రంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 10 నుంచి 13వతేదీ వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలను గురువారం సాయంత్రం అధికారులు విడుదల చేశారు. పీజీసెట్ ద్వారా 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో 145కుపైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో నెల్లూరు దర్గామిట్టకు చెందిన పఠాన్ సాజిదాబేగం 2వ ర్యాంకు, సంస్కృతం విభాగంలో కపాడిపాళెంకు చెందిన ముత్యాల శివనాగమణి 3, హిందీ విభాగంలో నెల్లూరు పద్మావతిసెంటర్‌కు చెందిన సయ్యద్ సుమయ 4, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ విభాగంలో సీతారామపురానికి చెందిన బక్కా అశోక్‌రాజు 10, కామర్స్ విభాగంలో నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన చుండి సాయి కేశవ హరిప్రియ 10, ఎడ్యుకేషన్ విభాగంలో నవాబుపేటకు చెందిన బోయిన చైతన్య 9వ ర్యాంకు సాధించారు.

● ఏపీ ఎడ్‌సెట్‌లో..

బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష ఫలితాల్లోనూ జిల్లా విద్యార్థులు ర్యాంకులు సాధించారు. మెథడాలజీ ఇంగ్లీష్ విభాగంలో వింజమూరుకు చెందిన చెన్నబోయిన వెంకట శ్రీహర్షిత 9వ ర్యాంకు, మేథమేటిక్స్‌లో టీపీగూడూరు మండలం ఇస్కపల్లికి చెందిన ఇంగిలేల శ్రీనివాస్ 6, ఫిజికల్ సైన్స్‌లో ఏఎస్‌పేట మండలం తాళ్లపాడుకు చెందిన లెక్కల కల్యాణి 7వ ర్యాంకు సాధించారు.

- ముగిసిన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- చివరి రోజున ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



గ్రామోత్సవంలో వెంగమాంబ, గురవయ్య నాయుడు దంపతులు

అగ్నిగుండంలో కొబ్బరి వేస్తున్న భక్తులు



అంబరాన్నంటిన సంబరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్); జూన్ 27 : నర్రవాడలో శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఈ నెల 23న నిలుపుతో ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజుల పాటు వేడుకగా జరిగాయి. చివరి రోజు గురువారం వెంగమాంబ పేరంటాల దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామాల్లో ఊరేగారు. పేరంటాలను దర్శించుకొనేందుకు భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. హోమగుండంలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకొన్నారు. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన వెంగమాంబ ప్రధానోత్సవం గురువారం మధ్యాహ్నం వరకు సాగింది. ఉత్సవాలు ముగింపు సందర్భంగా పచ్చవ వంశీయులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ సారె తీసుకొచ్చి అమ్మవారికి అందచేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధికారులు విజయవంతంగా నిర్వహించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్ఐ ఉమాశంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంగమాంబ సేవాసమితి, భక్తమండలి, ఆర్యవైశ్య సంఘం, పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● అట్టహాసంగా బండలాగుడు పోటీలు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

ఉత్సవాల్లో చివరిరోజున రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగాయి. పోటీలను తిలకించేందుకు వేలాది మందిగా తరలిరాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా గుంపరమానదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు ప్రథమ, కడప జిల్లా చౌటపల్లికి చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు ద్వితీయ, గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన చెందిన పులగం తిప్పారెడ్డి ఎద్దులు తృతీయ, ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కిన కోటేశ్వరరావు ఎద్దులు చతుర్థ, నంద్యాల జిల్లా మురాళ్లపల్లికి చెందిన పులి చినఓబులరెడ్డి ఎద్దులు 5, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎద్దులు 6, అనంతపురం జిల్లా తోపుదుర్తికి చెందిన చెన్నప్ప ఎద్దులు 7, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎద్దులు 8, బాపట్ల జిల్లా వేటపాళెం గ్రామానికి చెందిన శిరీషాచౌదరి 9వ స్థానంలో నిలిచి విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఉషశ్రీ, కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీఏలో ఆయనో అధికారి.. నియోజకవర్గ స్థాయిలో పనిచేసే ఓ ఏపీఎంకం ఏసీ.. తన పరిధి లోని మండలాల్లో ఎన్‌ఆర్‌ఈజీ ఎస్ పనుల పరిస్థితిని సమీక్షించడం ఆయన విధి. కానీ రాజకీయ నాయకుడి అవతారమెత్తాడు. వైసీపీకి వీరభక్తుడిగా పనిచేశారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గెలుపు కోసం తన అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారు. సదరు ఏపీఎం వ్యవహారశైలిపై కొందరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఆదేశాలతో జరిగిన విచారణలో వాస్తవమని తేలినా ఇప్పటివరకు చర్యల్లేవు. ఆయనపై జిల్లా ఉన్నతాధికారులకు ఎందుకో అంత ప్రేమ అర్థం కావడం లేదంటూ ఆ శాఖలోనే చర్చించుకుంటుండటం గమనార్హం.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఆయనపై ఎందుకో అంత ప్రేమ!

- వైసీపీ వీరభక్తుడిగా డీఆర్డీఏ అధికారి
- ఉదయగిరిలో అన్నీ తానై వ్యవహరించిన వైనం
- ఎన్నికల కమిషన్‌కు పలువురు ఫిర్యాదు
- ఆరోపణలు నిజమని తేల్చిన జడ్పీ సీఈవో
- అయినా చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు



ఉదయగిరి ప్రాంతంలో పనిచేసే ఓ డీఆర్డీఏ ఏపీఎం పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఆయన సాగించిన హవా అంతా ఇంత కాదని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. నెల్లూరులో పని చేస్తున్నప్పటి నుంచే ఉదయగిరిలో ఏరియా కోఆర్డినేటర్ (ఏసీ) పోస్టును ఇన్‌చార్జిగా తెచ్చుకున్నట్లు చెబుతున్నారు. ఇదంతా ఉదయగిరిలో వైసీపీకి బలం పెంచేందుకేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలో ఈ అధికారే ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి అన్నంతగా వ్యవహరించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బెంగళూరు, ఉదయగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైసీపీ సమావేశాల్లోనూ ఆ అధికారే అంతా తానై వ్యవహరించిన వీడియోలు అప్పట్లో వైరల్‌గా మారాయి. అసలు జిల్లా అధికారులు నిర్వహించే సమావేశాలకు, టెలీకాన్ఫరెన్స్‌లకు కూడా హాజరయ్యేవారు కాదని చెప్పుకుంటు న్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఎన్నికల సమయంలో మరింత బరితెగించారు. వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేసినట్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. పొదుపు సంఘాలనూ ప్రభావితం చేసినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ గత నెలలో కలెక్టర్, ఎన్నికల అధికారిని ఆదేశించింది. దీంతో కలెక్టర్ హరినారాయణన్.. జడ్పీ సీఈవో కన్నమనాయుడును విచారణాధికారిగా నియమించారు. విచారణలో సదరు డీఆర్డీఏ ఏపీఎం కమ్ ఏసీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు నిర్ధారించారు. ఆయనపై చర్యలకు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఇదంతా జరిగి వారాలు గడుస్తున్నప్పటికీ ఇంత వరకూ సదరు అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదులపై గంటల వ్యవధిలోనే చర్యలు తీసుకున్న జిల్లా యంత్రాంగం.. ఈ అధికారి విషయంలో మాత్రం ఆ స్థాయిలో స్పందించకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంపై డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డిని వివరణ కోరగా ఉదయగిరి ఏసీపై వచ్చిన ఆరోపణలు నిజమని జడ్పీ సీఈవో నివేదిక ఇచ్చారని, ఆ నివేదికను కలెక్టర్‌కు పంపామని వివరించారు. సదరు నివేదికను పరిశీలించి కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

పదేళ్లకే భవనం శిథిలం

● మందుబాబులకు అడ్డాగా పంచాయతీ కార్యాలయం



నిరుపయోగంగా ఉన్న పంచాయతీ కార్యాలయ భవనం

ఉదయగిరి, జూన్ 27: కొండాయపాళెం పంచాయతీ కార్యాలయ భవనాన్ని పదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10లక్షలతో నిర్మాణం చేపట్టారు. భవనంలో పంచాయతీ కార్యకలాపాలు కొన్నేళ్లపాటు కొనసాగినా అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సచివాలయాన్ని ఆ భవనంలోనే ఏర్పాటు చేసింది. తదుపరి సచివాలయాల నూతన భవనాల నిర్మాణాలు పూర్తి చేసి సచివాలయ వ్యవస్థను నూతన భవనంలోకి మార్చారు. అప్పటినుంచి ఈ భవనం నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అలనాపాలన లేకపోవడంతో తలుపులు, కిటికీలు చెదలుపట్టి పాడయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉదయగిరి రూరల్, జూన్ 27: గండిపాళెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఒకచోట కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించి, సహపంక్తి భోజనాలు చేస్తామని పేర్కొన్నారు.

దీక్ష యాప్‌లో నమోదు చేయాలి

ఉదయగిరి, జూన్ 27: జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో విద్యా ప్రవేశ కార్యక్రమాలను దీక్ష యాప్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం జులై 25 వరకు కొనసాగుతుందన్నారు. ఆయా పాఠశాలలో పరిధిలో ఉన్నవారు ఆవాస ప్రాంతాల్లో 6-14 సంవత్సరాల లోపు పిల్లలను నమోదు చేసుకోవాలన్నారు.

నీటి నమూనాల సేకరణ


బెస్తకాలనీలోని కుళాయి నీటి నమూనాను సేకరిస్తున్న అధికారులు

సీతారామపురం, జూన్ 27: డయేరియా నివారణ చర్యల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామాల్లో అధికారులు ముందస్తుగా నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సీతారామపురంలోని వీధుల్లో గురువారం ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ సన్నపురెడ్డి భార్గవి ఆధ్వర్యంలో కుళాయిల వద్ద నీటి నమూనాలు సేకరించి గ్రామ సచివాలయంలో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, ఆశావర్కర్ బేబి పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన నాయకులు

అనంతసాగరం, జూన్ 27: దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గురువారం నెల్లూరులో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనంతసాగరం వాసి అల్లంపాటి సాంబశివారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రధాన సమస్యలు తెలిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్‌ఎంలతో సమావేశం


మాట్లాడుతున్న ఎంఈవో జానకిరామ్

సంగం, జూన్ 27: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఎంఈవో జానకిరామ్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడిఈడు పిల్లలందరనీ బడిలో చేర్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన దీక్షా యాప్‌లో రోజువారి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

బస్సు టైర్ పగిలింది..

ఉదయగిరి, జూన్ 27: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఉదయగిరి-కావలి బస్సునకు గురువారం త్రుటిలో ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున 5.30గంటలకు బస్సు ఉదయగిరిలో బయలుదేరింది. విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే డ్రైవర్ వైపు ఉన్న ముందు టైరు పగిలింది. రోడ్డు పక్కకు వెళ్లడాన్ని గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ సర్వీసును ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, జూన్ 27: సున్నంవారిచింతలలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడురోజులు సీతారాముల ఉత్సవాలు చేపడతామని నిర్వాహకులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా నాగదేవి కల్యాణం

వింజమూరు, జూన్ 27: గోళ్లవారిపల్లె చుంచువారి ఇలవేల్పు నాగరాజు సహిత నాగదేవి కల్యాణంను భక్తులు చుంచు వంశస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరైయ్యారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలలతో సన్మానించారు. అంతకుముందు గ్రామస్థులు, పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహానికి కాకర్ల సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూనల వెంకటేశ్వర్లు, చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, దాట్ల రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

ఉదయగిరి, జూన్ 27: జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం ఏడీఏ అధికారి శ్రీనివాసులు, ఏవో నాగమోహన్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ నిల్వలు, పురుగు మందుల వివరాలు, విత్తనాలు, తదితర రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏవోలు ఆంజనేయులునాయక్, సుబ్బారెడ్డి, ఏఈవో ఇత్తడి నారాయణ పాల్గొన్నారు.

కలగానే రింగురోడ్డు నిర్మాణం?

● టెండర్లతోనే నిలిచిన ప్రక్రియ ● పనుల ప్రారంభంపైనే ఆశలు


అధ్వానంగా రామాపురం-కాకొల్లువారిపల్లి రోడ్డు

వరికుంటపాడు, జూన్ 27: అధికారుల అలసత్వమో లేదా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో తెలియదు గానీ గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ రహదారుల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. పనులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోక పోవడం విచారకరం అని మండల ప్రజలు వాపోతున్నారు. అందులో భాగంగా రామాపురం జాతీయ రహదారి నుంచి హుస్సేన్‌నగర్ మీదుగా కాకొల్లువారిపల్లి జాతీయ రహదారి వరకు మంజూరైన రింగు రోడ్డు నిర్మాణం కలగానే మారింది. ఇప్పటికే రెండుసార్లు టెండర్ల ప్రక్రియ కొనసాగినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.3.80కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులను మంజూరు చేసింది. అయితే టెండర్ల ప్రక్రియలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తిరిగి వైసీపీ ప్రభుత్వ హయాంలో మరోమారు రూ.3.50కోట్లతో 3.3 కి.మీ పొడవునా నిర్మాణ పనులను మంజూరు చేసి టెండర్లను కొనసాగించినా ఫలితం లేకుండా పోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఎందుకు పనులు ప్రారంభించడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు పలురకాలుగా చర్చించుకుంటున్నారు. చేసే దేమిలేక రోజుల తరబడి రాళ్లు, రప్పల నడుమ మోకాలి లోతు గుంతల్లో ప్రయాణం కొనసా గిస్తున్నారు. అదీనూ గ్రావెల్ రహదారి కావడంతో అడుగడుగునా ఎక్కడ వాహనం గతితప్పి జారిపడి ప్రమాదాలకు గురిఅవుతుందో అని బెంబేలెత్తిపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పల్లెప్రాంతాల మీదుగా మంజూరైన రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించా లని కోరుతున్నారు.

చోరీ చేస్తాం.. తగ్గేదేలే..!

● దొరకని దొంగల ఆనవాళ్లు ● తలలు పట్టుకుంటున్న క్లూస్ టీం


ఉదయగిరి: గత నెలలో జరిగిన చోరీలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం (ఫైల్)

ఉదయగిరి, జూన్ 27: పట్టణంలో ఇటీవల జరిగిన రెండు చోరీల సంఘటనల్లో వేలిముద్రల సేకరణ పోలీసులకు ఆనవాళ్లు దొరకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. చోరీ చేస్తాం.. తగ్గేదేలే పట్టుకోండి చూద్దాం అంటూ అటు పోలీసులు, ఇటు క్లూస్‌టీంకు దొంగలు ఆనవాళ్లు చిక్కకుండా తాము ఇంటిలో తిరిగిన ప్రదేశం, తాకిన వస్తువులు, తలుపులు, కిటికీలు, బీరువాలకు తమ వేలిముద్రలను లేకుండా తడి దుస్తులతో తుడిపేసి వెళుతున్నారు. ఉదయగిరిలో జరిగిన రెండు సంఘటనల్లో ఎలాంటి క్లూ దొరక్క పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. గతనెల 23న స్థానిక బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. చోరీ చేసిన దొంగలు ఎక్కడ దొరక్కుండా చేసి వెళ్లారు. వచ్చిన క్లూస్‌టీంకి ఆనవాళ్లు లభించలేదు. తిరిగి నెల గడవక ముందే ఈ నెల 23న స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. వేలిముద్రల సేకరణకు వచ్చిన క్లూస్‌టీం సభ్యులకు గత పరిస్థితే ఎదురైంది. దీంతో రెండు చోట్ల చోరీలకు పాల్పడిన దొంగల ముఠా ఒకటేనని పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. పోలీసులకు దొంగలు దొరుకుతారా లేక పోలీసులకు పెనుసవాల్‌గా మారుతారా అన్నది చర్చనీయాంశమైంది.

సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే కాకర్లకు వినతిపత్రం అందజేసిన జడ్పీటీసీ మాజీ సభ్యురాలు


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కలివెల జ్యోతి

సీతారామపురం, జూన్ 27: నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కలివెల జ్యోతి గురువారం వింజమూరులోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలివెల జ్యోతి మండల సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రం అంజేసి మాట్లాడారు. మండలంలో వలసల నివారణకు ప్రత్యేక చర్యలు, నీటి అవసరాల కోసం సీతారా మసాగర్ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం, చెరువుల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు, మెట్ట ప్రాంతంలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు, మహిళలు, యువతకు స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్, తాగునీటి కోసం ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలన్నారు. మండల అభివృద్ధికి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ప్రైవేట్ అంబులెన్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీతో సీపీఎం, సీఐటీయు నాయకులు

ఆత్మకూరు, జూన్ 27: స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి భవన్‌లో గురువారం ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్లు యూనియన్ల నూతన కమిటీలను సీఐటీయూ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ కార్యదర్శిగా సుల్తాన్‌బాష, అధ్యక్షుడిగా షరీఫ్ ఎన్నిక య్యారు. కార్యక్రమంలో శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, హజ రత్తయ్య, డేవిడ్‌రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా అందజేయాలి

వింజమూరు, జూన్ 27: ప్రజా పంపిణీ వ్యవస్థ సరుకులను సక్రమంగా అందజేయాలని తహసీల్దారు ఎంవీ.కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఎండీయూ వాహనాల డ్రైవర్లు రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జూలై 1వ నుంచి ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులను వాహనాలతో కార్డుదారులకు అందజేయాలని ఆదేశించారు. ఎండీయూ వాహనాల డ్రైవర్లు వాహనాలను సిద్ధం ఉంచాలన్నారు. కార్యక్రమంలో మోహన్, డ్రైవర్లు ఉన్నారు.

డిప్యూటీ డీఈవో పాఠశాల తనిఖీ


రికార్డులు చూస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

సంగం, జూన్ 27: మర్రిపాడు జిల్లా ఉన్నత పాఠశాలను గురువారం ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు, స్టూ డెంట్ స్కూల్ కిట్ పంపిణీ తదితర అంశాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు నూరుశాతం హాజరు నమోదైయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరిసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన

సంగం, జూన్ 27: ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ చిన్నారులకు చేతుల శుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డయేరియాకు గల కారణాలను వివరించారు. అంగన్‌వాడీ పరిసర ప్రాంతాల్లో దోమలు చేరకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మానసాదేవి ఉత్సవాలు

వరికుంటపాడు, జూన్ 27: తూర్పురొంపిదొడ్లలో వెలసిన మానసాదేవి ఆలయ పదో వార్షికోత్సవ ఉత్సవాలను చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాదన, ప్రత్యేక పూజలు, శనివారం హోమాలు, మహానివేదము, గ్రామోత్సవం, ఆదివారం వాల్మీకి పూజ, కుంకుమపూజ, పొంగళ్లతో నైవేద్యం పెడతామన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మలుపుల రోడ్లలో ఆగని ప్రమాదాలు


కొత్తపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కలిగిరి, జూన్ 27: గ్రామీణ రహదారుల్లోని మలుపులు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొత్తపేట, అనంతపురం, ఎరుకలరెడ్డిపాలెం, గుడ్లదొన, చినఅన్నలూరు గ్రామాల మీదుగా వెళ్లే రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద ఆర్ అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అంతేకాకా అవి సింగిల్ రోడ్లు కావడం, మలుపుల వద్ద కూడలి ప్రాంతంగా ఉండటం, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

వైసీపీ నేతల ఓట్ల రాజకీయం

● ఎన్నికల సమయంలో సీసీ రోడ్ల నిర్మాణానికి హడావిడి
● కోడ్ రావడంతో ఆగిన పనులు
● ప్రభుత్వం మారడంతో నిర్మాణానికి ముందుకు రాని కాంట్రాక్టర్ ● రాకపోకలకు ప్రజల ఇక్కట్లు

కావలి, జూన్ 27: ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని వదిలేసి, ఎన్నికల సమయంలో ఓట్లకోసం వైసీపీ నేతలు సీసీ రోడ్ల నిర్మాణానికి హడావుడి చేశారు. వాస్తవానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ నిధులు నిర్వహణకు కూడా చాలక ఇబ్బందులు పడుతుండగా, ఎన్నికల వేళ ఓట్ల కోసం టీచర్స్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60లక్షలను జనరల్ ఫండ్స్ నుంచి మంజూరు చేశారు. ఆ పనులను కూడా బినామీ పేరుతో వైసీపీ నాయకులకే అప్పగించారు. సీసీ రోడ్లు పూర్తి చేసి ఆ ప్రాంతంలోని ఓట్లను అప్పనంగా వేయించుకోవాలని హడావిడి చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావటంతో రోడ్ల నిర్మాణం అర్థంతరంగా ఆపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా కూడా అక్కడ రోడ్ల పనులు చేపట్టక పోవటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

● **అసంపూర్తిగా నిర్మాణాలు**

ట్రంకురోడ్డు నుంచి పొలాల్లో ఉన్న లేఅవుట్ వరకు పెద్ద సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు. కొన్ని చోట్ల మొదటి లేయర్ వేసి, రెండో లేయర్ వేయకుండా వదిలి వేశారు. మరికొన్ని చోట్ల రోడ్ల నిర్మాణం కోసం కాంక్రీట్ గోడలు నిర్మించి వదిలేశారు. ఈ సీసీ రోడ్డుకు మధ్యమధ్యలో పలు అడ్డ రోడ్లు రావటంతో వాటి వద్ద రోడ్డు క్రాసింగ్‌కు అనువుగా అప్రోచ్ రోడ్డు వేయకుండా వదిలివేశారు. దీంతో అడ్డరోడ్లు పై నడిచే ప్రజలు సీసీ రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను తోలుకున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్డును పూర్తి చేయించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది.

పూర్తి చేయిస్తాం

సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ రావటంతో పనులు ఆపివేశారు. ఆ నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

- ఏఈ శ్రీనివాసులురెడ్డి


కావలి టీచర్స్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు


సీసీ రోడ్డు నిర్మాణం కోసం కట్టి వదిలేసిన సైడ్ వాల్స్

పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు


కలిగిరి : పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కలిగిరి, జూన్ 27: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమావేశానికి ఆలస్యంగా రావడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి సమయపాలన విధుల్లో భాగమన్నారు. మండల పరిధిలో ఒకరిద్దరు కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ల పనితీరు బాగా లేదని, వారు తమ పద్ధతిని మార్చుకోకపోతే జిల్లా అధికారులకు నివేదికను పంపుతామని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీపై నేడు సమీక్ష

అల్లూరు : పింఛన్ల పంపిణీపై శుక్రవారం పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్ల పంపిణీ చేపడతామని, సిబ్బంది సరిపడా లేకుంటే అంగన్‌వాడీ సిబ్బంది లేదా ఇతర సిబ్బందిని వినియోగించుకుంటామన్నారు. జూన్30న ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో శనివారమే పింఛన్ల నగదు డ్రా చేసుకోవాలనే అంశంపై కూడా చర్చిస్తామన్నారు.

దీక్ష యాప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈవో వెంకటసుబ్బయ్య

కావలిటౌన్, జూన్27: దీక్షా యాప్‌పై ప్రధానోపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొని అవగాహన కల్పించారు. దీక్షా యాప్‌పై ప్రతిఒక్క ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీచర్లు విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలతోపాటు ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

జూ. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి


గుడ్లూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కందుకూరు ఉప విద్యాశాఖాధికారి ప్రసాదరావు

గుడ్లూరు, జూన్ 27: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని కందుకూరు ఉప విద్యాశాఖాధికారి ఎంవీ ప్రసాదరావు అన్నారు. గుడ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తొలుత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీ రామోహన్‌రావు, పాఠశాల సిబ్బంది పద్మావతి, కాపులూరి వెంకటేశ్వర్లు, సులోచన, బత్తల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆర్బీకేలో సిబ్బందిని నియమించండి

లింగసముద్రం: సచివాలయం-2 పరిధిలో అధికారులు ఆర్బీకేని నిర్మించారు.కానీ సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీంతో నాలుగేళ్లుగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది. ఏడాది క్రితం అన్నెబోయినపల్లికి చెందిన వీఏఏను ఆర్బీకేకి ఇన్‌చార్జిగా నియమించారు. ఎన్నికలకు ముందు ఆమె బదిలీపై వెళ్లిపోయింది.దీంతో స్థానిక వీఏఏ కిరణ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.ఆయన కూడా నాలుగు నెలలు పనిచేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ ఆర్బీకే తలుపులు మూసే ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో అధికారులు సిబ్బందిని నియమించాలని మండల రైతులు కోరుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిల్వ

బిట్రగుంట : బోగోలులోని రైస్‌మిల్లు కూడలిలో బుధవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిల్వ చేరింది.దీంతో గురువారం ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిమెంట్‌తో మురుగు కాలువలు నిర్మించినా, కనెక్షన్ ఇవ్వక పోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి పోతున్నాయి. ఇకనైనా పంచాయతీ అధికారులు వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయుడి ఉత్సవాలు


ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

వలేటివారిపాలెం, జూన్ 27: మండలంలోని శింగమనేనిపల్లెలో గురువారం అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు నాగేశ్వరరావును శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి అత్తోటి అంజమ్మ, టీడీపీ నేతలు విజయసారథి, అత్తోటి వెంకటేశ్వర్లు, కొత్త మాధవరావు, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు



బాలకార్మికులతో పనులు చేయించడం చట్ట విరుద్ధమని ఫ్లెక్సీ ప్రదర్శించిన అధికారులు

కావలి రూరల్, జూన్ 27: బాలకార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా గూడూరు కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎం.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. కావలిలో గురువారం బాలకార్మికుల గుర్తింపు కోసం సోదాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించకుండా వారిని బడికి పంపేలా ప్రోత్సహించాలన్నారు. ఉదయగిరి బ్రిడ్జి కింద, ఎస్‌బీఐ రోడ్డు, ట్రంక్‌రోడ్డులో నిర్వహించిన సోదాల్లో పనులు చేస్తున్న ఇద్దరు బాలకార్మికులను గుర్తించామని, ఆ యజమానులపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని పలుప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు ఎన్. హరిబాబు, ఐ.వెంకటేశ్వర్లు, సత్యన్నారాయణ, సతీష్‌బాబు, ప్రసాద్, సుమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా కందుకూరు : ఇంటూరి

కందుకూరు, జూన్ 27: కందుకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాజీకౌన్సిలర్లు, టీడీపీ ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారులతో చర్చించారు. మున్సిపల్ శాఖామంత్రి నారాయణ సహకారంతో ఆరునెలల్లోపు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఇంటూరి పేర్కొన్నారు.

● **అన్న క్యాంటీన్ పరిశీలన**

స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఇంటూరి పరిశీలించారు. త్వరలో క్యాంటీన్ పునః ప్రారంభమవుతున్నందున అవసరమైన పనులను పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధు, రావూరి రామకోటయ్య, పొడపాటి నాగేశ్వరరావు, రావి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోకూరు, బడేవారిపాలెం, నూకవరం, నేకునాంపురం, కాకుటూరు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ తాటికొండ మధుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోకూరు బస్టాండు సెంటర్‌లో విద్యుత్ తీగలు మార్చే క్రమంలో సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


బస్‌షెల్టర్ ముందున్న ట్రాన్స్‌ఫార్మర్

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు అభ్యంతరం చెప్పినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోలేదు. దీంతో బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికులు కూర్చొనేందుకు భయపడుతున్నారు. మరికొంతమంది బస్‌షెల్టర్ వద్దకు అసలు వెళ్లడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.